
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 22 ఫిబ్రవరి 2024



అమ్మఒడి, ఆసరా డబ్బు తినడమే కాదు..

అప్పుడప్పుడు అధికారులు చెప్పే మాట కూడా వినాలి

వైసీపీ సభలకు రాకపోతే మీకు పథకాలు ఉండవు...

- మాకు ఉద్యోగాలు ఉండవు..
- ఇళ్లలో పనులు చేసుకుంటారో... మానేస్తారో మాకు అనవసరం
- సీఎంకు స్వాగతం చెప్పడానికి రావాల్సిందే

- మహిళా సంఘాలకు యూసీడీ సిబ్బంది హుకుం
- మండుటెండలో మహిళల అగచాట్లు
- ప్రతి గ్రూపు సభ్యులు జాబితా చేతిలో పట్టుకుని మరీ హాజరు నమోదు
- ప్రతిసారీ పార్టీ కార్యక్రమాలకు రమ్మనడం సమంజసంగా లేదంటూ మహిళల గగ్గోలు





విమానాశ్రయం వద్ద హైవేపై ఎండలో నిరీక్షిస్తున్న మహిళలు

విశాఖపట్నం, గోపాలపట్నం, పెందుర్తి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):

"కొద్దిరోజులు కిందట జరిగిన ఆడుదాం...ఆంధ్రా' కార్యక్రమానికి అధికారులు బస్సులు పెట్టారు. ఒక్కరూ రాలేదు. దీంతో కార్యక్రమం జనం లేక ఫెయిల్ అయ్యింది. సీఎంతో అధికారులు చీవాట్లు తినాల్సి వచ్చింది. అప్పుడు మనం చేసిన తప్పుకు ఇప్పుడు (బుధవారం) శిక్షగా రోడ్డుపక్కన నిలబడి మనం స్వాగతం పలకాలి. అందరినీ తప్పనిసరిగా తీసుకురావాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ నుంచి డైరెక్టుగా ఆదేశాలు వచ్చాయి. అందరూ రావాల్సిందే. ఉదయం తొమ్మిదయ్యేసరికి మనమంతా రోడ్డుపై ఉండాలి. పనులు ఉన్నాయని చెబితే కుదరదు. పనులు చేసుకుంటారో...పక్కనపెట్టేసి వస్తారో మాకు తెలియదు. గ్రూపు సభ్యులంతా రావాల్సిందే. ప్రభుత్వం ఇచ్చే అమ్మఒడి, ఆసరా వంటి పథకాలతో వచ్చే డబ్బు తినడమే కాదు...అప్పుడప్పుడు అధికారులు చెప్పే మాట కూడా వినాలి. లేకపోతే పథకాలు ఆపేస్తారు. మీరు రాకపోతే మీకు పథకాలు ఉండవు...మాకు ఉద్యోగం ఉండదు..ఉదయాన్నే కొళాయిలు కూడా ఇవ్వరు, కాబట్టి నీటి కోసం ఆలోచన చేయక్కర్లేదు."

- ఇదీ డ్వాక్రా సంఘాల గ్రూపుల్లో రిసోర్స్‌పర్సన్లు పెట్టిన మెసేజ్

నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు రావాలంటూ డ్వాక్రా సంఘాల సభ్యులపై రిసోర్స్ పర్సన్ల ద్వారా జీవీఎంసీ అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. కొద్దిరోజుల కిందట నగరంలో సీఎం పాల్గొన్న 'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుక జనం లేక అట్టర్ ప్లాఫ్ అయింది. దీంతో అధికారులపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తంచేశారనే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మరోమారు చీవాట్లు తినకూడదని అధికారులు ముందుజాగ్రత్త పడ్డారు. బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు భారీగా జనాలను సమీకరించాలని నిర్ణయించారు. సీఎం ఎయిర్‌పోర్టులో దిగినప్పటి నుంచి చినముషిడివాడలో గల శారదా పీఠానికి చేరుకునేంత వరకూ ... మిగతా 6వ పేజీలో



శారదా పీఠంలో రాజశ్యామల అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి (-వార్త మెయిన్ ఎడిషన్‌లో)

అధికారుల ఓవరాక్షన్

సీఎం పర్యటించే ప్రాంతంలో టీడీపీ హోర్డింగ్‌లు కానరాకూడదని వైసీపీ పెద్దల ఆదేశం

- అమలు పరచిన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం
- ఎయిర్‌పోర్టు-చినముషిడివాడ మార్గంలో అర్ధరాత్రి ఫ్లెక్సీల చించివేత
- 'దేశం' నాయకులకు రూ.లక్షల నష్టం
- ప్రైవేటు ఏజెన్సీలు, భవన యజమానుల నుంచిలీజుకు తీసుకుని మరీ హోర్డింగ్‌లు ఏర్పాటు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నగర పర్యటన సందర్భంగా జీవీఎంసీ అధికారులు ఓవరాక్షన్ చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి చినముషిడివాడ మార్గంలో ప్రభుత్వ అనుకూల పోస్టర్లు, హోర్డింగ్‌లు మాత్రమే ఉండాలన్న వైసీపీ నేతల ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం అర్ధరాత్రి తెలుగుదేశం పార్టీ నాయకుల ఫ్లెక్సీలను చించివేయించారు. బుధవారం ఉదయం ఆరు గంటలకల్లా సీఎం పర్యటించే ప్రాంతంలో హోర్డింగ్‌లను తొలగిస్తామని చెప్పినా.. అధికారులు దూకుడుగా వ్యవహరించడం విమర్శలకు తావిచ్చింది.



ఎన్ఏడీ - సింహాచలం రోడ్డులో టీడీపీ హోర్డింగ్‌ను తొలగించిన దృశ్యం



చినముషిడివాడ సమీపంలో ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీని తొలగించిన జీవీఎంసీ అధికారులు

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమాన్ని పురస్కరించుకుని నగరంలో పలుచోట్ల ఆ పార్టీ నాయకులు...ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఇందుకోసం యాడ్ ఏజెన్సీలు, ప్రైవేటు భవనాల యజమానుల నుంచి తాత్కాలిక ప్రాతిపదికన హోర్డింగ్‌లను విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, తదితరులు లీజుకు తీసుకున్నారు. పెద్ద హోర్డింగ్‌లకు సరిపడా ఫ్లెక్సీ తయారీకి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేశారు. ఫ్లెక్సీ హోర్డింగ్‌పైకి తీసుకువెళ్లడానికి మరో రూ.10 నుంచి రూ.15 వేలు, హోర్డింగ్ ఇచ్చిన ఏజెన్సీ/ప్రైవేటు వ్యక్తులకు ఆయా ప్రాంతం బట్టి చదరపు అడుగుకు రూ.50 నుంచి రూ.80 వరకు అద్దె చెల్లించారు. ఇలా ఎన్ఏడీ నుంచి చినముషిడివాడ వరకు శ్రీభరత్‌కు చెందిన హోర్డింగ్‌లు పది, గణబాబు, ఇతర నాయకులకు చెందిన చిన్నా, పెద్ద హోర్డింగ్‌లు పది వరకూ ఉన్నాయి. అయితే సీఎం బుధవారం చినముషిడివాడ వస్తుండడంతో ఆ దారిలో టీడీపీ హోర్డింగ్‌లు తొలగించాలని యాడ్ ఏజెన్సీలు, ప్రైవేటు భవనాల యజమానులను మంగళవారం సాయంత్రం జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆదేశించారు. బుధవారం ఉదయానికల్లా ఫ్లెక్సీలు తొలగిస్తామని ... మిగతా 6వ పేజీలో



మిలాన్ సందర్భంగా రక్షణ శాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

ప్రపంచ సంస్కృతికి ప్రతిబింబం... మిలాన్ గ్రామం

- కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతులమీదుగా ప్రారంభం

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):

ప్రపంచంలో వివిధ దేశాల సంస్కృతీ సంప్రదాయాలకు వేదికగా నిలిచే 'మిలాన్ గ్రామం'ను కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. నావల్ డాక్‌యార్డులోని సముద్రిక ఆడిటోరియం సమీపాన ఏర్పాటుచేసిన దీనిని మంత్రి బుధవారం సాయంత్రం ప్రారంభించి నేవీ కుటుంబాలకు ఆహ్వానం పలికారు. ఇక్కడ భారతీయ వంటకాలే కాకుండా మిలాన్‌లో పాల్గొంటున్న 50 దేశాలకు చెందిన వంటకాలు, వస్తువులు, దుస్తులు, సంగీత పరికరాలు ప్రదర్శనకు పెట్టారు. మిత్రుల అలవాట్లు, అభిరుచులు తెలుసుకుంటూ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించుకుంటూ స్నేహ సంబంధాలు పెంచుకోవడమే మిలాన్ లక్ష్యం కావడంతో ఈ గ్రామంలో వాటికి సంబంధించిన అంశాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కేంద్ర మంత్రి కూడా ఆసక్తిగా అన్నింటిని తిలకించి, ఆసక్తికరమైన వాటిని అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఆకట్టుకున్నాయి. నగర ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రక్షణ శాఖ పారిశ్రామిక ప్రదర్శన

రక్షణ రంగంలో వస్తున్న మార్పులు, అందుబాటులో ఉన్న పరికరాలు, కొత్త ఆవిష్కరణలను వివరించే పారిశ్రామిక ప్రదర్శనను కూడా రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. ఇందులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ఎల్ అండ్ టి, భారత్ ఎలక్ట్రానిక్స్, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్, డిఫెన్స్ స్టార్టప్స్, డీఆర్‌డీఓ, తదితర సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు పెట్టాయి.

ఇది మూడు రోజులు ఉంటుంది. ఈ ప్రదర్శనలో ఉంచిన ఒక కొత్త తుపాకీని రక్షణ శాఖా మంత్రి ఆసక్తిగా తిలకించి, దాని గురించి అడిగి తెలుసుకొని, లక్ష్యానికి గురిపెట్టి పనితీరు పరీక్షించారు.



మిలాన్ సందర్భంగా రక్షణ శాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఉంచిన రాకెట్ లాంచర్లు

వీఆర్ఎంపీ పనులు పూర్తి

- మార్చి 1న ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభం?



మల్కాపురం, ఫిబ్రవరి 21: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైజాగ్ రిఫైనరీ మోడరనైజేషన్ ప్రాజెక్టు (వీఆర్ఎంపీ) పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. మార్చి ఒకటో తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వీఆర్ఎంపీని ప్రారంభించేందుకు హెచ్‌పీసీఎల్ యజమాన్యం ఏర్పాట్లు చేస్తున్నది. ఈ ప్రాజెక్టును ప్రారంభించిన వెంటనే ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. ఇప్పటివరకు హెచ్‌పీసీఎల్‌లో ఏడాదికి 8.5 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురు ఉత్పత్తి చేస్తుండగా, ఈ ప్రాజెక్టు పూర్తిగా వినియోగంలోకి వస్తే 15 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకుంటుందని హెచ్‌పీసీఎల్ అధికారులు చెబుతున్నారు. హెచ్‌పీసీఎల్ రూ.26 వేల కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు 2015 ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి, 2016లో పనులు ప్రారంభించింది. వాస్తవానికి ఈ పనులను 2021 నాటికి పూర్తిచేయాల్సి ఉండగా, కొవిడ్ కారణంగా సుమారు ఏడాదిన్నర పనులు నిలిచిపోయాయి. ఎట్టకేలకు పూర్తి కావడంతో ప్రధాని చేతులు మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అంతా అండర్ స్టాండింగేనా??

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ నిర్ణయాలపై విమర్శల వెల్లువ

- నగర పాలక సంస్థకు నష్టం కలిగించేలా నిర్ణయాలు
- ఇప్పటికే పూర్తయిపోయిన పనులకు పరిపాలనా ఆమోదాలు
- ముందస్తు అవగాహన కుదరడమే కారణమని ఆరోపణలు
- పాలకవర్గం పెద్దల చేతిలో కీలుబొమ్మలుగా మారిన సభ్యులు
- కనీసం చర్చ జరగకుండానే ఆమోద ముద్ర



సమావేశమైన స్టాండింగ్ కమిటీ సభ్యులు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) నిధులు దుబారా కాకుండా చూడడంతోపాటు నగరవాసులకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేయాల్సిన స్టాండింగ్ కమిటీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలకవర్గంలోని కొంతమంది నేతల ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జీవీఎంసీలో స్టాండింగ్ కమిటీకి అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. అభివృద్ధి పనులు, పరిపాలనాపరమైన ఆమోదాలు, ఉద్యోగుల సర్వీసుకి సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం కౌన్సిల్ తర్వాత స్టాండింగ్ కమిటీకి మాత్రమే ఉంటుంది. కౌన్సిల్ సమావేశం మూడు నెలలకు ఒకసారి జరుగుతుంది కాబట్టి, అప్పటివరకూ కొన్ని పనులపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తే నగర అభివృద్ధిపై ప్రభావం పడుతుంది. అందువల్ల రూ.50 లక్షల కంటే తక్కువ విలువైన పనులు, ఇతర అంశాలపై నిర్ణయాలు తీసుకునేందుకు మేయర్ అధ్యక్షతన పది మంది సభ్యులతో కూడిన స్టాండింగ్ కమిటీకి అధికారం కల్పించారు. సరిగ్గా దీనినే జీవీఎంసీ పాలకవర్గంలోని కొంతమంది పెద్దలు, ఉన్నతాధికారులు తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. ఎజెండాలోని అంశాలపై కనీసం చర్చ జరపకుండానే ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతున్నారు. పాలకవర్గంలోని కొంత మంది పెద్దలు, జీవీఎంసీ ఉన్నతాధికారులు సంయుక్తంగా స్టాండింగ్ కమిటీ సభ్యులతో ముందుగానే సమావేశమై ఎజెండాలోని అంశాలకు ఆమోదముద్ర వేసేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తాజాగా స్టాండింగ్ కమిటీ తీసుకున్న కొన్ని నిర్ణయాలను పరిశీలిస్తే విపక్ష కార్పొరేటర్లు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేకపోలేదనిపిస్తోంది. బీచ్‌రోడ్డులోని విశాఖ మ్యూజియం మరమ్మతులు సుమారు రూ.1.4 కోట్లతో చేపట్టారు. దీనిని ఈనెల 19న జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ పునఃప్రారంభించేశారు కూడా. అయితే మంగళవారం సమావేశమైన స్టాండింగ్ కమిటీ...మ్యూజియంలో కొన్ని మరమ్మతు పనులు చేయాల్సి ఉందంటూ, వాటిని చేపట్టేందుకు ... మిగతా 6వ పేజీలో

మా పార్టీ అధికారంలోకి రాగానే విచారణ జరిపిస్తాం

- పీలా శ్రీనివాసరావు, టీడీపీ ఫ్లోర్ లీడర్



జీవీఎంసీలో జరుగుతున్న అక్రమాలతోపాటు స్టాండింగ్ కమిటీ తీసుకుంటున్న అడ్డగోలు నిర్ణయాలపై మా పార్టీ అధికారంలోకి రాగానే ప్రత్యేక విచారణ జరుపుతాం. జీవీఎంసీకి నష్టం కలిగించేలా, ప్రజాధనం దుర్వినియోగం చేసేవారెవరైనా సరే శిక్ష అనుభవించక తప్పదు. కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకోవాల్సిన అంశాలను కూడా ముక్కలుగా చేసి స్టాండింగ్ కమిటీలో పెట్టి ఆమోదించేసుకుంటున్నారు. అభ్యంతరం తెలపాల్సిన అధికారులు వారికి వంతపాడుతుండడం విచారకరం. ఇప్పటికే పూర్తిచేసిన కొన్ని పనులకు ఇప్పుడు పరిపాలనా ఆమోదం ఇవ్వడం ఆశ్చర్యంగా ఉంది. వీటిపై ఇప్పటికే కమిషనర్‌కు ఫిర్యాదు చేశాం.

నేడు ఉప రాష్ట్రపతి రాక




విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):

భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్ మిలాన్-24 లో పాల్గొనడానికి గురువారం సతీసమేతంగా విశాఖపట్నం వస్తున్నారు. వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానంలో ఉదయం ఎనిమిది గంటలకు ఢిల్లీలో బయలుదేరి 10.30 గంటలకు విశాఖలోని ఐఎన్ఎస్ డేగాలో దిగుతారు. సముద్రిక ఆడిటోరియంలో జరిగే ఇంటర్నేషనల్ మేరీటైమ్ సదస్సులో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు అక్కడ ఉండి తిరిగి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లిపోతారు.

ప్రొటోకాల్ బాధ్యతల నుంచి అమర్‌కు ఉద్వాసన?

- ఉప ముఖ్యమంత్రి బూడికి అవకాశం



విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):

ఐటీ, భారీ పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు మరో షాక్ తగిలింది. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటివరకూ టికెట్ కేటాయించని అధిష్ఠానం తాజాగా ప్రొటోకాల్ బాధ్యతల నుంచి కూడా ఆయన్ను తప్పించింది. విశాఖపట్నానికి వీవీఐపీలు ఎవరు వచ్చినా వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున విమానాశ్రయంలో స్వాగతం పలికే ప్రొటోకాల్ బాధ్యతలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిర్వహిస్తున్నారు. గతంలో రాష్ట్రపతి వచ్చినప్పుడు కూడా ఆయనే స్వాగతం పలికారు. అయితే ఆకస్మికంగా ఆయన్ను తప్పించి, ఉమ్మడి జిల్లాకు చెందిన మరో మంత్రి బూడి ముత్యాలనాయుడుకు ఆ బాధ్యత అప్పగించారు. ఇది వైసీపీ వర్గాల్లో చర్చకు దారితీసింది.

మేలో ప్రపంచ గవర మహాసభలు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 21: ఫిబ్రవరి చివరి వారంలో జరపాల్సిన ప్రపంచ గవర మహాసభలు వాయిదావేసి ఈ ఏడాది మేలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు గవర ప్రపంచ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సీపీ ఏవీ రమణ తెలిపారు.బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికలు నేపథ్యంలో మహాసభలకు అవకాశం తక్కువగా ఉన్నందున ఈమార్పు చేసినట్టు వివరించారు. గవర జాతీయులందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

దాత ఆర్థికసాయంతో గుడిలో టైల్స్ ఏర్పాటు


పోలమాంబ అమ్మవారి గుడిలో టైల్స్ నిర్మాణ పనులు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 21: గ్రేటర్ 30 వార్డు కుమ్మరవీధి పోలమాంబ ఆలయంలో టైల్స్ నిర్మాణ పనులకు మాజీ బ్రహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ ఆర్థిక సాయం చేశారు. ఇటీవల జరిగిన పరస మహోత్సవాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గర్భగుడికి టైల్స్ ఏర్పాటు ప్రతిపాదనలు సుధాకర్ ముందుంచారు. దీంతో స్పందించి ఆయన గర్భగుడిలో టైల్స్‌ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు డి. సత్యనారాయణ, వై.రాజు. నాణి, సురేష్, కాళ్ల కిరణ్, శైలజా, డి.లక్ష్మీజ్యోతి, డి.పద్మజ సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హై కోర్టు స్టేపై హర్షం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 21: బీఈడీ అభ్యర్థులను ఎస్జీటీకి అనుమతించరాదని హైకోర్టు విధించిన స్టే పై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ స్టే ఇవ్వకుంటే లక్షలాది మంది డీఈడీ చేసిన అభ్యర్థులు నష్టపోతారన్నారు.

సాంకేతిక విద్యలో ప్రాంతీయ భాషల పాత్ర కీలకం

- ఎన్ఎస్‌టీఎల్ టెక్నికల్ డైరెక్టర్ చంద్రశేఖర్
- ఘనంగా మాతృభాషా దినోత్సవం


విద్యార్థులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్


మాట్లాడుతున్న సాహితీవేత్త డాక్టర్ సూర్యారావు

కంచరపాలెం, ఫిబ్రవరి 21 : సాంకేతిక విద్యలో ప్రాంతీయ భాష కీలకంగా మారుతోందని ఎన్ఎస్‌టీఎల్ టెక్నికల్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ అన్నారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ విశాఖ ఆధ్వర్యంలో బుధవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంతీయ భాషా ప్రచార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చంద్రశేఖర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఛైర్మన్ పీవీజీ గణేష్ కుమార్ మాట్లాడుతు ప్రాంతీయ భాషల్లో సాంకేతికతను అర్థం చేసుకుని ఆచరించడంతో ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. ప్రిన్సిపాల్ కె.నారాయణరావు, ఆర్.నాగేశ్వరరావు,అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్ఞానాపురం: స్థానిక సెయింట్‌జోసెఫ్ మహిళా కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సిస్టర్ డా.షైజీ ప్రారంభించగా, బుల్లయ్య కాలేజీ విశ్రాంత అధ్యాపకులు డా.ఎం సుబ్బారావు, ఆదిత్య కళాశాల ఆంగ్ల అధ్యాపకులు శ్రీ దివ్య అతిథులుగా హజరై మాతృభాష ప్రాశస్త్యం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు అంతర కళాశాలల మాతృభాషకు సంబంధించి వివిధ పోటీలు నిర్వహించారు. నగరంలోని 10కి పైగా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.విజేతలుగా నిలిచిన గాయత్రి, ప్రిజమ్, ఆదిత్య కళాశాలల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.కె. జయలక్ష్మి, సిస్టర్ జైన్, థామస్, డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి తదితరులు పాల్గొన్నారు.


సెయింట్ జోసెఫ్‌లో ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

మురళీనగర్‌లో మాతృభాష దినోత్సవం

మురళీనగర్; అంతర్జాతీయ మాతృభాష దినోవాన్ని బుధవారం మురళీనగర్‌లో జరిపారు. శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమకారులు దత్తి.అప్పలనాయుడు అతిథిగా హాజరై తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. తెలుగు భాషలోని గొప్పదనం, తెలుగు, రచనలు తదితరాలపై మాట్లాడారు. బాలలు, విద్యార్థులకు విద్యా సామగ్రి అందించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి అధ్వర్యంలో నిర్వహించారు. క్లబ్ సభ్యులు, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు సంపద పలుకుబడులే..

సీతంపేట: తెలుగు భాషకు సామెతలు, జాతీయాలు గొప్ప సంపద అని సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు పేర్కొన్నారు. సీతంపేట రాంజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు పలుకుబడులు, వైచిత్రి అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూర్యారావు మాట్లాడుతూ తెలుగు జాతి సంస్కృతిని భాషతో ముడిపడి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.విజయకుమార్, సీహెచ్ చిన్న సూర్యనారాయణ, పరవస్తు ఫణీశయన సూరి, కొత్తూరు రమణ, కె.భీమస్త్రశ్వరరావు, రాంభట్ల నృసింహ శర్మ, మేడా మస్తాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాధవధారలో బహుమతులిస్తున్న అతిథి

తెలుగుదేశం పాలనలోనే అభివృద్ధి

- టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ


సూపర్ 6 పథకాల కరప త్రాలు అందిస్తున్న గండి బాబ్జీ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 21: తెలుగుదేశం పార్టీ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి గండిబాబ్జీ అన్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులో శంఖారావం డోర్ టూ డోర్ సూపర్ 6 కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లలపాలెంలోని ప్రాంతంలోని పర్యటించి సూపర్ 6 పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రా ష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు మూలకు చేరాయన్నారు. వైసీపీ గత నాలుగున్నరేళ్ల పాలనలో రా ష్ట్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని విమర్శించారు.ప్రతిపక్షాలపై దాడులు, కక్ష సాధింపు చర్యలతో వైసీపీ పాలకులు ముందుకు సాగుతున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చం ద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు , క్లస్టర్ ఇన్‌చార్జిలు తదితరులున్నారు.

మీడియా గొంతు నొక్కాలని చూస్తున్నారు

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్


మాట్లాడుతున్న నజీర్

మహారాణిపేట, ఫిబ్రవరి 21:రాష్ట్రంలో పత్రికల గొంతు నొక్కాలని చూస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, ఈనాడు సంస్థలపై వైసీపీ నేతల దాడులను ఆయన ఖండించారు. ప్రపంచ చరిత్రలో నియంతలు గా పేరొందిన ముసోలిని, ఈడి అమీన్, హిట్లర్‌లకు ప్రతి రూపంగా ముఖ్యమంత్రి జగన్ ప్రవర్తిస్తున్నారని అన్నారు. అధికార గర్వంతో పత్రికలపై దాడులు చేయుస్తూ వికృతానందంపొందుతున్నారన్నారు.ప్రభుత్వ అరాచకాలను వెలుగులోకి తీసుకువస్తున్న పాత్రికేయులకు రాష్ట్రంలో రక్షణ కరువైందన్నారు. ప్రజాస్వామ్య వాదులంతా ఈ దాడులను ఖండించాలని కోరారు. రాష్ట్రంలో మీడియాపై జరుగుతున్న దాడులపై కేంద్ర ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పిచ్చోడి చేతిలో రాయిలా రాష్ట్రంలో పాలన

- జనసేన పార్టీ 'ఉత్తర' ఇన్‌చార్జి ఉషాకిరణ్


కస్తూరినగర్‌లో పర్యటిస్తున్న జనసేన పార్టీ నాయకులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ విమర్శించారు. గ్రేటర్ 46వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు గోరపల్లి శివ ఆధ్వర్యంలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని కస్తూరినగర్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆము హాజరై ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చరిత్రలో తుగ్లక్ కోసం చదువుకున్నామని, కానీ ప్రస్తుతం ప్రత్యక్షంగా చూస్తున్నామని జగన్ పాలననుద్దేశించి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 30వేల మంది మహిళలు మిస్సింగ్ అని తేలితే, దానిపై కనీసం సమీక్ష చేయకుండా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై క్రిమినల్ కేసు బనాయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరికిన సతీష్, శివారెడ్డి, రమణ, నూకరాజు, శ్రీధ ర్, భాస్కర్, మోసెస్, ఎల్లాజీ, కన్నా, టీడీపీ వార్డు అధ్యక్షుడు పుక్కళ్ల పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు....రీ షెడ్యూల్

విశాఖపట్నం, ఫిబ్రవరి 21: వాల్తేరు డివిజన్ పరిధిలోని పార్వతీపురం, గుమ్డా స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్నందున ఈనెల 29 నుంచి పలు రైళ్లను రద్దుతోపాటు మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. అలాగే మరికొన్ని ఒరిజినేటింగ్ రైళ్లను రీ షెడ్యూల్ చేశామని పేర్కొన్నారు. ఈనెల 29 నుంచి మార్చి ఐదు వరకు విశాఖ-రాయపూర్ ప్రత్యేక పాసింజర్ (08528), రాయపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08527), విశాఖ-భవానిపట్న ప్రత్యేక పాసింజర్ (08504), విశాఖ-కోరాపుట్ ప్రత్యేక పాసింజర్ (08546), ఈనెల 29 నుంచి మార్చి ఆరు వరకు కోరాపుట్-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08545) రద్దు. మార్చి ఒకటి నుంచి ఆరు వరకు భవానీపట్న-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08503), మార్చి ఒకటి నుంచి నాలుగు వరకు విశాఖ-కోరాపుట్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18512), మార్చి రెండు నుంచి ఐదు వరకు కోరాపుట్-విశాఖ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18511) రద్దు చేశారు. పలు రైళ్లను ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేశారు. వాటిలో విశాఖ-లోకమాన్య తిలక్ టెర్మినస్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22847) మార్చి మూడో తేదీన ఐదన్నర గంటలు ఆలస్యంగా, నాందేడు-సంబల్‌పూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20810) మార్చి 4న నాలుగు గంటలు ఆలస్యంగా, ఇరోడ్-సంబల్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ మార్చి ఒకటన రెండు గంటలు ఆలస్యంగా, ఎర్నాకులం-టాటా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (08190) ఈనెల 29న రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరుతాయి.

దారి మళ్లింపు

విశాఖ-నిజాముద్దీన్ సమతా ఎక్స్‌ప్రెస్ (12807) ఈనెల 29, మార్చి 2, 3, 5న వయా దువ్వాడ, విజయవాడ, బల్లార్ష మీదుగా, నిజాముద్దీన్-విశాఖ సమతా ఎక్స్‌ప్రెస్ (12808) ఈనెల 29, మార్చి 1, 2, 4న వయా బల్లార్ష, విజయవాడ, దువ్వాడ మీదుగా నడుస్తాయి. టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) ఈనెల 29, మార్చి 3న టాటా, జరోలి, పలాస, విజయనగరం మీదుగా, ఎర్నాకులం-టాటా ఎక్స్‌ప్రెస్ (18190) ఈనెల 28, మార్చి 3న వయా విజయనగరం, పలాస, జరోలి మీదుగా నడుస్తాయి. వీటీలో పాటు పూరి-అహ్మదాబాద్-పూరి (12843/12844), పూరి-గాంధీధాం-పూరి (22974/22973), భువనేశ్వర్-జునాగర్ రోడ్డు-భువనేశ్వర్ (20837/20838) ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా కొన్ని తేదీల్లో మళ్లింపు మార్గం నడిచనున్నారు.

మతోన్మాదులకు అధికారంతో విపరిణామాలు

- ప్రముఖ రచయిత్రి కేఎన్ మల్లీశ్వరి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత్రి మల్లీశ్వరి, తదితరులు

సీతంపేట, ఫిబ్రవరి 21: మతోన్మాద శక్తులు అధికారం చేపడితే ఎదురయ్యే ప్రమాదం గత పదేళ్లుగా దేశంలో కనిపిస్తుందని ప్రము ఖ రచయిత్రి కేఎన్ మల్లీశ్వరి పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో రెడ్ బుక్ డేని పురస్కరించుకుని మార్క్సిస్టు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఫాసిజం మూలాలు అనే పుస్తకాన్ని మల్లీశ్వరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చరిత్రను వక్రీకరించి పాఠ్యాంశాలుగా ప్రవేశపెడుతున్నారన్నారు. మతోన్మాదాన్ని పెంచి హిందువులను ఓటు బ్యాంకుగా మలుచుకోవడంలో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్‌లు విజయవంత మయ్యాయని అన్నారు. పీపీఎస్‌పీసమన్వయకర్త పి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫాసిజాన్ని ఓడించడంలో కార్మిక వర్గం పాత్ర అనే అంశంపై ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, మతతత్వం, పర్యవసానాలు అన్న అంశంపై డాక్టర్ సీఎస్ క్షేత్రపాల్ రెడ్డి ప్రసంగించారు. అధ్యయన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా బోధన


ఆర్ఐవో మురళీధర్

సీతంపేట, ఫిబ్రవరి 21: విద్యార్థులు ఒత్తిడి గురికాకుండా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఆర్ఐవో మురళీధర్ అన్నారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బోధన ఎలా చేయాలనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ లో పలు కళాశాలల జూనియర్ లెక్చరర్స్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో శ్రీ విశ్వ పాఠశాల్లో డైరెక్టర్లు కె.ధర్మరాజు, పి.సూర్యానారాయణ ఈ కార్య క్రమం నిర్వహించారు. ముఖ్యవక్తగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


సీతారాములు

సీతమ్మధార, ఫిబ్రవరి 21: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయి దేవస్థానంలో సీతారాముల కళ్యాణోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు రాజాస్వామి ఆధ్వర్యంలో ఈ వేడుక జరిపారు. భక్తులు ఆలయంలో శ్రీమద్రామాయణ పారాయణం చేశారు. మహిళలు కోలాటంతో అలరించారు.

పర్యావరణంపై అవగాహనకు దేశవ్యాప్త సైకిల్ యాత్ర


సైకిల్ యాత్రలో శివసూర్యన్ సెంథిల్ రామన్

సీతమ్మధార, ఫిబ్రవరి 21: కాలుష్యంతో వాతావరణంలో చేకూరే నష్టాలపై అవగాహన కల్పిస్తూ సైకిల్ యాత్ర చేస్తున్నట్టు తమిళనాడుకి చెందిన శివసూర్యన్ సెంథిల్ రామన్ పేర్కొన్నారు. ఈ యాత్ర బుధవారం సీతమ్మధారకు చేరుకుంది. తమిళ కళాయ్‌మండపంలో శివసూర్యన్ సెంథిల్ రామన్ ఆయన మాట్లాడారు. కొవిడ్ సమయంలో తన ఆరోగ్యం కోసం ఇంటి నుంచి తన కార్యాలయానికి సైకిల్‌పై వెళ్లడం ప్రారంభించానన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని భావించి దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు విడతల వారీగా 30 వేల కిలోమీటర్ల ప్రయాణం సాగించానన్నారు. గుజరాత్ నుంచి కొయంబుతూర్, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 10 వేలకిలో మీటర్ల సైకిల్ యాత్రను ప్రస్తుతం కొనసాగిస్తున్నారన్నారు. జనవరి 15వ తే దీన కాశ్మీర్ శ్రీనగర్ నుంచి సైకిలింగ్ ప్రారంభించి సిక్కిం, గ్యాంగ్ టాక్, ఏపీలోని విశాఖపట్నం వచ్చానని తెలిపారు. కళాశాలల్లో విద్యార్థులకు వాతావరణం మార్పులు, కాలుష్యంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తాను 2017లో బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసినట్టు చెప్పారు.

ముఖ్యమంత్రికి స్వాగతం


సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రులు బూడి, అమర్


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆహ్వానిస్తున్న అధికారులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 21: పెందుర్తి శారదాపీఠంలో జరిగిన రాజశ్యామల యాగంలో పాల్గొనడానికి నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం ఉదయం 11.50 గంటల గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న సీఎంకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బి.సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో చినముషిడివాడ వెళ్లారు. పర్యటన ముగించుకుని తిరిగి మధ్యాహ్నం 3.15కు విమానాశ్రయం చేరుకున్న సీఎంకు మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో 3.25 గంటలకు విజయవాడ వెళ్లారు.

రాష్ట్ర గవర్నర్‌కు....

మిలాన్-24లో పాల్గొనడానికి నగరానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం సాయంత్రం 5.29 గంటలకు ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరానికి వెళ్లారు.

అమ్మఒడి, ఆసరా డబ్బు తినడమే కాదు...

... 5వ పేజీ తరువాయి

దారిపొడవునా మహిళలను నిలబెట్టి ప్లకార్డులతో స్వాగతం పలకడం ద్వారా ఆయన మెప్పు పొందాలని భావించారు. దీనికోసం జీవీఎంసీ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను తరలించాలని యూసీడీ అధికారులను ఆదేశించారు. ఒక్కో ఆర్పీ తన పరిధిలోని గ్రూపుల నుంచి కనీసం వంద మందిని తీసుకురావాలని టార్గెట్ విధించారు. దీంతో ఆర్పీలంతా సీఎంకు స్వాగతం పలికేందుకు తప్పనిసరిగా రావాల్సిందేనని తమ పరిధిలోని మహిళా సంఘాల గ్రూపుల్లో వాయిస్ మెసేజ్‌లు పెట్టారు. దీంతో సభ్యులంతా తప్పదన్నట్టు ఉదయాన్నే ఎనిమిదిన్నరకు తమ ఇళ్ల వద్దకు వచ్చిన ఆటోలు ఎక్కి బయలుదేరారు.

షెడ్యూల్ ప్రకారం సీఎం జగన్ బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని రోడ్డు మార్గంలో శారదా పీఠానికి వెళ్లాలి. అందుకే ఉదయం తొమ్మిది గంటలకే మహిళలను సంబంధిత ఆర్పీలు, ఏపీడీలు తమకు కేటాయించిన ప్రాంతానికి తీసుకువెళ్లి రోడ్డుపక్కన నిలబెట్టారు. అయితే సీఎం ఎయిర్‌పోర్టులో దిగిన తర్వాత గంట ఆలస్యంగా అక్కడ నుంచి బయలుదేరారు. అప్పటికే గంటల తరబడి ఎండలో నిలబడిన మహిళలు ఎండ తీవ్రతకు ఇబ్బందిపడ్డారు. తమ చేతిలో ఉన్న ప్లకార్డులను అడ్డంపెట్టుకుని ఫుట్‌పాత్‌లపైనే కూర్చుండిపోయారు. మరికొందరు సమీపంలోని దుకాణాల వద్దకు వెళ్లి ఎండ నుంచి సేదతీరారు. యూసీడీ సిబ్బంది మహిళా సంఘాల సభ్యుల వివరాలతో కూడిన జాబితాను చేతిలో పట్టుకుని మరీ వచ్చినవారి హాజరు తీసుకోవడం కనిపించింది. గ్రూపుల వారీగా ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించారు. మహిళలను సమీకరించడంతో పాటు వచ్చినవారు తిరిగి వెనక్కి వెళ్లిపోకుండా ఆపేందుకు వీలుగా ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో ఏపీడీ, పీడీతోపాటు జోనల్ కమిషనర్లుకి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఇదిలావుంటే సీఎంకు స్వాగతం పలికేందుకు వచ్చిన మహిళలు మండుటెండలో గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో అధికారుల తీరును తూర్పారబట్టారు. సీఎం వస్తే పార్టీ కార్యకర్తలను తీసుకువెళ్లాలిగానీ, ప్రతిసారీ తమనే రావాలని ఆదేశించడం ఎంతవరకు సమంజసమని గోపాలపట్నం జంక్షన్‌లో నిలబడిన ఒక మహిళ నిలదీశారు. మహిళలకు సంబంధించిన కార్యక్రమాలకు తమను పిలిస్తే ఇబ్బందిలేదు గానీ, ఆటల పోటీల ముగింపునకు, ఇతరత్రా కార్యక్రమాలకు సీఎం వస్తున్నారని ప్రతిసారీ తమనే తరలించడం వల్ల కుటుంబపరంగా ఇబ్బందులు పడుతున్నామని బాజీ జంక్షన్‌లో నిలబడిన మహిళలు కొందరు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాకపోతే పథకాలు ఆపేస్తామని బెదిరిస్తున్నారని, వస్తే ఇంట్లో పనులు ఆగిపోతున్నాయని మరికొందరు మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు.

అధికారుల ఓవరాక్షన్

... 5వ పేజీ తరువాయి

చెప్పి, ఆ మేరకు కూలీలను మాట్లాడుకున్నారు. ఈలోగానే మంగళవారం అర్ధరాత్రి తరువాత ఎయిర్‌పోర్టు నుంచి చినముషిడివాడ వరకూ గల టీడీపీ హోర్డింగ్‌లను తొలగించారు. ఫ్లెక్సీలు పనికిరాకుండా చించివేశారు. వాటి స్థానంలో కొన్నిచోట్ల 'సిద్ధం' ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతించారు. కాగా యాడ్ ఏజెన్సీలు, ప్రైవేటు భవనాల యజమానులు బుధవారం ఉదయం ఈ విషయం గుర్తించారు. జీవీఎంసీ అధికారుల అత్యుత్సాహం వల్ల టీడీపీ నేత శ్రీభరత్‌కు సుమారు ఐదారు లక్షల రూపాయల మేర నష్టం జరిగింది. జీవీఎంసీకి అద్దె చెల్లించి చట్టబద్ధంగా హోర్డింగ్‌లు ఏర్పాటుచేస్తే దౌర్జన్యంగా తొలగించడమేమిటని టీడీపీ నేతలు ప్రశ్నిస్తురు. ఈ విషయమై విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ సీఎం పర్యటనలో ఫ్లెక్సీలు తొలగించి జీవీఎంసీ అధికారులు తమ స్వామి భక్తిని చాటుకున్నారని ఆరోపించారు. అద్దెకు తీసుకున్న హోర్డింగ్‌లపై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు తొలగించడం అన్యాయమన్నారు. రాజకీయ పార్టీల నాయకులకు అధికారులు తాబేదార్లుగా వ్యవహరించకుండా నిబద్ధతతో పనిచేయాలన్నారు.

అంతా అండర్ స్టాండింగేనా??

... 5వ పేజీ తరువాయి

పరిపాలనా ఆమోదం తెలిపింది. వాస్తవానికి పనులకు పరిపాలనా ఆమోదం లభించిన తరువాతే అధికారులు టెండరు ప్రక్రియ ప్రారంభించాలి. టెండర్లలో ఎవరు తక్కువకు కోట్ చేస్తే వారికి పనులను అప్పగించి, నిబంధనల ప్రకారం పూర్తయ్యేలా చూడాలి. కానీ జీవీఎంసీ అధికారులు మాత్రం ఆయా పనులను టెండర్ వరకూ వెళ్లకుండా కేవలం నామినేషన్ పద్ధతిపై తమ అస్మదీయులకు అప్పగించేందుకు వీలుగా ఒక్కో పనిని ముక్కలుగా చేసి రూ.5 లక్షలలోపు ఉండేలా ప్రతిపాదనలు తయారుచేశారు. ఇప్పటికే నామినేషన్ పేరుతో పనులు పూర్తిచేసి...ఇప్పుడు పరిపాలనాఆమోదం కోరడాన్ని ఏవిధంగా చూడాలో జీవీఎంసీ పాలకవర్గం పెద్దలు, జీవీఎంసీ ఉన్నతాధికారులు చెప్పాలని విపక్ష కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఇదిలావుంటే వెంకోజీపాలెం జంక్షన్ నుంచి హనుమంతవాక జంక్షన్ వరకూ జాతీయ రహదారిపై రెండువైపులా కొత్తగా హాట్ మిక్స్ తారురోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. ఒకపక్కన పని పూర్తిచేసేసి...ఇప్పుడు పరిపాలనా ఆమోదం ఇస్తే రూ.99.5 లక్షలు అంచనా వ్యయంతో టెండర్లు పిలిచి, పనులు పూర్తిచేస్తామంటూ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి స్టాండింగ్ కమిటీ ముందు పెట్టారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించినా సభ్యులు కనీసం అభ్యంతరం చెప్పకుండానే ఆమోదించేస్తున్నట్టు ప్రకటించేయడం విశేషం. అసలు కొత్తగా రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించిన జాతీయ రహదారి జీవీఎంసీకి చెందినది కానప్పటికీ ఎలా నిధులు ఖర్చు చేస్తారు?, టెండర్ పిలవకుండా ఇప్పటికే పూర్తిచేసిన పనికి ఇప్పుడు పరిపాలనా ఆమోదం కోరడంలో ఆంతర్యమేమిటని అధికారులను నిలదీయకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా పెదగదిలిలో ఇప్పటికే వంతెన నిర్మాణం పనులు ప్రారంభించేయగా, ఆ పనికి కూడా ఇప్పుడు పరిపాలనా ఆమోదం తెలపాలని కోరారు. వీటికితోడు జోన్-3 పరిధి టౌన్‌కొత్తరోడ్డులోని ఎంఎస్ఎఫ్‌లో పోగైన చెత్తను అక్కడే ఏర్పాటుచేసిన క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్(సీసీఎస్)లో వాహనాలతో వేసేందుకు ఏకంగా రూ.55 లక్షలు ఖర్చవుతుందని పేర్కొంటూ ప్రతిపాదనలు తయారుచేయగా, కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించేయడం ఆశ్చర్యానికి గురిచేసింది. సీసీఎస్ నుంచి చెత్తను కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించడానికే ఏడాదికి రూ.1.5 కోట్లు ఖర్చవుతుంటే, పది అడుగులు దూరంలో ఉన్న చెత్తను కాంపాక్టర్లలో వేసేందుకు ఏకంగా రూ.55 లక్షలు ఎందుకు ఖర్చవుతుందని సభ్యులు ప్రశ్నించకపోవడం విస్మయపరుస్తోంది. ఇలాంటి నిర్ణయాలు చాలా ఉన్నాయని అధికారులు చెబుతుండడం స్టాండింగ్ కమిటీ పనితీరుకు అద్దంపడుతోంది.

'నాయీ బ్రహ్మణులకు మొండిచేయి'


మాట్లాడుతున్న జనసేన నేత సాధిక్

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 21: వైసీపీ పాలనలో నాయీ బ్రహ్మణుల ఉనికికే తీ వ్ర నష్టం జరిగిందని జనసేన ఉత్తరాంధ్ర కన్వీనర్, 39 వ వార్డు కార్పొరేటర్ సాధిక్ విమర్శించారు. బుధవారం లక్ష్మీ టాకీస్ వద్ద పార్టీ కార్యాలయంలో నాయీ బ్రహ్మణులతో జరిగిన ఆత్మీయసమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు ఉచితంగా వృత్తి పనిముట్లు, సబ్సిడీ రుణాలు అందించి ప్రోత్సహించిందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన అన్నిరకాలు సబ్సిడీ రుణాలు నిలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయీ బ్రహ్మణుల కమిటీ సభ్యులు జగన్నాధరావు, ఎ.తిరుపతి, రాంబాబు, సురేష్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

ఐద్వా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 21: ఐద్వా మహాసభల పోస్టర్‌ను బుధవారం స్టీల్‌ప్లాంట్‌లో ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం నుంచి నగరంలో జరగనున్న ఐద్వా మహాసభలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నామన్నారు. పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాము పోరాటాలు చేస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సభలు విజయవంతమయ్యేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు పుష్ప, సుమలత, సూర్యప్రభ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి కల్పించకపోతే ఉద్యమిస్తాం'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 21: స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు యాజమాన్యం ముందుకు రాకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని నిర్వాసిత సంఘం నాయకుడు యెల్లేటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కాంట్రాక్టు కార్మికుల పోస్టుల భర్తీ నిమిత్తం ఇంటర్వ్యూలు నిర్వహించిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కల్పన కోసం ఎంతోకాలంగా నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు.

విద్యార్థినులకు కిట్లు పంపిణీ

అగనంపూడి, ఫిబ్రవరి 21: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థినులకు నాంది ఫౌండేషన్ సౌజన్యంతో బుధవారం బ్యాగు, రెయిన్ కోట్, పుస్తకాలతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఉక్కు రిటైర్డ్ ఉద్యోగి ఎలమంచిలి చినఅప్పారావు చేతుల మీదగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు నిర్వాసిత గ్రామాల్లో నాంది ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు లావణ్య, వై.వరలక్ష్మి, స్థానిక నాయకులు దానబాల అప్పలనాయుడు, ఎ.సింహాద్రి, హెచ్‌ఎం వి జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ జ్యూవెలర్ మేకింగ్‌లో శిక్షణ



మాట్లాడుతున్న మహిళ

మల్కాపురం, ఫిబ్రవరి 21: గ్రేటర్ 58వ వార్డు కోడి పందెల దిబ్బ ప్రాంతంలోని సామాజిక భవనంలో కోరమాండల్ ఎరువుల కర్మాగారం సౌజన్యంతో మహిళలకు ఆర్టిఫిషియల్ జ్యూవెలర్ మేకింగ్‌లో శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. లెకా లెర్నింగ్ ఫౌండేషన్ సహకారంతో ఈ శిక్షణ ఇస్తున్నారు. ఈసందర్భంగా కోరమాండల్ కంపెనీ ఈహెచ్‌ఎస్ ప్రధాన అధికారి నాగరాజు మాట్లాడారు. ఈ శిక్షణను శ్రద్ధతో నేర్చుకుని స్వయంగా ఉపాధి పొందాలని మహిళలకు సూచించారు. 30 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం పలువురు మహిళలు పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో సీఎస్‌ఆర్ డిప్యూటీ మేనేజర్ ఎస్. వెంకటరమణ, అసిస్టెంట్ మేనేజర్ జీనస్, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, రమాదేవి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** లీలామహల్, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 20, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 48, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 48, బీరకాయలు 55, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 20, క్యారెట్ 20, దొండకాయలు 38, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 110, బరబాటి 30, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 215, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 34 , కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 125
ఫారం ధర	-- 145
విత్ స్కిన్	-- 260
స్కిన్‌లెస్	-- 270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

కాపుజగ్గరాజుపేటలో దాహం కేకలు

కుళాయిల నుంచి అరకొరగా తాగునీటి సరఫరా

దుర్గంధంతో కూడిన నీరు బోరింగ్‌ల నుంచి వస్తుందని ప్రజల ఆవేదన

మూలకు చేరిన బోర్లకు అధికారులు మరమ్మతులు చేపట్టడంతో పాటు ఇంటింటికీ కుళాయిలు వేయాలని విజ్ఞప్తి

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 21: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) 88వ వార్డు పరిధిలోని కాపుజగ్గరాజు పేటలో గత కొద్ది సంవత్సరాలుగా తాగునీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ ప్రాంతానికి కొన్నేళ్ల క్రితం మేహాద్రి గెడ్డ నుంచి తాగునీరు సరఫరా అయ్యేలా పైపు లైన్లు వేశారు. అయితే వీటిని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకుండా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా వదిలేశారు. సుమారు 250 గడపలు ఉన్న ఈ ప్రాంతానికి పదుల సంఖ్యలో కొళాయిలు వేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. అయితే అవికూడా సక్రమంగా పనిచేయడం లేదు.



ఖాళీ బకెట్లతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఎప్పుడు కొళాయిల నుంచి నీరు వస్తుందో.. ఎప్పుడు రాదో తెలియని దుస్థితి నెలకొంది. ఒకవేళ కొళాయిలు నీరు వచ్చినా రెండు బిందెలకు సరిపడా కూడా రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో తమకు తాగునీరందక నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నామని మహిళలు వాపోతు న్నారు. దీంతో తాము బోరింగులపై ఆధారపడాల్సి వస్తుందని పలువురు గ్రామస్థులు చెబుతున్నారు. అయితే బోరింగ్‌ల ద్వారా వస్తున్న నీరు తాగడానికి ఉపయోగ పడడం లేదని పేర్కొంటున్నారు. అందువల్ల చేసేది లేక తాగునీటికి ఏ రోజుకా రోజు కొనుగోలు చేసుకుంటున్నామని బావురుమంటున్నారు. మరో పక్క పలుచోట్ల బోరింగ్‌లు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో వాడుక నీటి కోసం సైతం అవస్థలు పడుతున్నామని మహిళలు ఆవేదన చెందుతు న్నారు. తమ సమస్యలను పలుమార్లు అధికారులకు విన్నవించినా వారినుంచి స్పందన లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో బుధవారం పలువురు మహిళలు బోరింగ్‌ల వద్ద ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామంలోని ప్రతి ఇంటికీ కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

అరకొర సరఫరాతో అవస్థలు



కాపుజగ్గరాజు పేటలోని అన్ని కాలనీల్లో తాగునీటి కోసం పడుతున్నాం. ఉన్న కొద్దిపాటి కొళాయిల ద్వారా అరకొరగా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. చాలీచాలని నీటితో అష్టకష్టాలు పడుతున్నాం. గ్రామంలో మరమ్మతులకు గురైన బోర్లకు మరమ్మతులు చేయడంతో పాటు తాగునీరు అందరికీ అందేలా అధికారులు చూడాలి.

-రమణమ్మ, స్థానికురాలు

అధికారులు స్పందించాలి



మా కాలనీల్లో కొళాయిలు వేసేందుకు సర్వేలు చేయడంతో పాటు పైపు లైన్లు వేశారు. కానీ పూర్తి స్థాయిలో తాగునీరు అందించడం లేదు. ఉన్న బోరింగ్‌లు కూడా ఎప్పటికప్పుడు మరమ్మతులతో మూలకు చేరుతున్నాయి. వీటిని బాగు చేయాలని కోరుతూ తాగునీటి సరఫరా విభాగం సిబ్బందికి మొర పెట్టుకుంటున్నా ఫలితం ఉండడం లేదు. బోరింగ్‌ల నుంచి దుర్గంధంతో కూడిన నీరు వస్తున్నందున తాగడానికి ఉపయోగపడడం లేదు. అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో నీటి సరఫరా చేయాలని కోరుతున్నాం.

-శ్రీను, స్థానికుడు

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

గాజువాక ప్రధాన మార్గంలో తరచూ తలెత్తుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు

పలు షాపింగ్ మాల్స్‌కు సెల్లార్లలో పార్కింగ్ సదుపాయం లేకపోవడమే కారణం



రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

గాజువాక, ఫిబ్రవరి 21: గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో అధిక శాతం షాపింగ్‌మాల్స్‌కు సెల్లార్లు లేకపోవడం, షాపింగ్‌లకు వచ్చే వారంతా ఇష్టారాజ్యంగా నడిరోడ్డుపైనే తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా వారంతపు రోజుల్లో ప్రధాన రహదారిలో ఉన్న అన్ని వస్త్ర దుకాణాల వద్ద కొనుగోలుదారుల తాకిడి అధికంగా ఉంటుంది. ఆ సమయంలో రోడ్డుపై నడిచేందుకు కూడా దారి లేకపోవడంతో పాదచారులు రాకపోకలు చేసేందుకు నానాపాట్లు పడుతున్నారు. ప్రధాన మార్గంలో అధిక శాతం షాపింగ్‌కు వచ్చే వినియోగదారుల వాహనాలతో నిండిపోవడంతో ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లడంతో ట్రాఫిక్ స్తంభించిపోవడం సర్వసాధారణంగా మారింది. కొత్త గాజువాక నుంచి పాత గాజువాక వరకు సాధారణ రోజుల్లోనే వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. వారంతపు రోజుల్లో ఈ రద్దీ మరీ తీవ్రంగా ఉంటుంది. కాగా కొన్ని షాపింగ్‌మాల్స్‌లో సెల్లార్లు ఉండగా, 30కు పైగా షాపులకు సెల్లార్లే లేనట్టు గతంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించారు. ఆయా షాపులకు సెల్లార్లను కేటాయించాలని నోటీసులు కూడా జారీ చేయగా ఆయా యజమానులు కొంత గడువు కోరారు. అయితే ఆ తర్వాత కాలంలో జీవీఎంసీ జోనల్ అధికారులు గానీ షాపుల యజమానులు కానీ సెల్లార్ల గురించి పట్టించుకోకపోవడంతో పరిస్థితి యథాతథంగానే కొనసాగుతోంది. ప్రతి షాపింగ్ మాల్‌కు సెల్లార్ ఉంటే ట్రాఫిక్ సమస్య ఇంత అధికంగా ఉండేది కాదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ప్రజా పోరుయాత్ర



ర్యాలీని ప్రారంభిస్తున్న గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, ఫిబ్రవరి 21: రాష్ట్ర వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా పోరుయాత్ర చేపడుతున్నామని ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. పోరుయాత్ర ర్యాలీని బుధవారం గాజువాకలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో అనేక పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తే వాటిని రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. తొమ్మిది రోజులపాటు ఈ యాత్ర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గూటూరు శంకరరావు, బొండా యల్లాజీరావు, పైడిరాజు, జిలకర్ర రమణ, రంజిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తిరుమల నగర్‌లో స్వచ్ఛ భారత్



పరిసరాలను శుభ్రపరుస్తున్న స్థానికులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 21: పరిసరాల పరిశుభ్రతతో అంటురోగాలు దరికి చేరవని తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, విశ్వేశ్వరరావు అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు తిరుమల నగర్ కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఇంకుడు గుంతలు, వాకింగ్ పార్కు, ఓపెన్ జిమ్ తదితర ప్రాంతాల్లో చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. రహదారులను శుభ్ర పరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎంతో బాధ్యతతో ఇంటి పరిసరాలలో చెత్తా చెదారాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలుష్య నివారణలో మొక్కలు నాటేలా చర్యలు తీసుకున్నామన్నారు. వాటిని పెద్దవి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరమానందం, పరమేశ్వరరావు, మూర్తి, సన్యాసిరావు, వసంత రెడ్డి తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

'వేతన సవరణలో జాప్యం తగదు'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 21: ఉక్కు కార్మికులకు ఆమోదయోగ్యమైన వేతన సవరణ చేయాలని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఎన్‌జేసీఎస్‌లో వేతన సవరణ జరిగినప్పటికీ ఇప్పటివరకు ఉక్కు కార్మికులకు మాత్రం నూతన వేతనాలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్మికుల మనోస్థైర్యం దెబ్బతీసేలా ఉక్కు యాజమాన్యం ప్రవర్తిస్తోందన్నారు. ఇప్పటికైకా ఉక్కు యాజమాన్యం నూతన వేతనాల అమలుకు ముందుకు రాకపోతే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

14 ఏళ్లలోపు పిల్లలు బడిలోనే ఉండాలి

» డీఈవో చంద్రకళ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో

మల్కాపురం, ఫిబ్రవరి 21 : ములగాడ మండలంలో పలు జీవీఎంసీ పాఠశాలలను డీఈవో ఎల్.చంద్రకళ బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా మల్కాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఇక్కడి పాఠశాలలో భవిత (ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల) కేంద్రం ను ప్రారంభించి మాట్లాడారు. 6 నుంచి 14 ఏళ్ల పిల్లలు పాఠశాలలోనే ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు ఎల్‌ఎస్‌ఆర్‌డబ్ల్యు స్కిల్స్ అయిన చదవడం , రాయడం , వినడం మాట్లాడడంపై శ్రద్ధ వహించేలా పలు సూచనలు చేశారు. మండల విద్యాశాఖ అధికారులు పనితీరు పట్ల సంతృప్తి చేశారు. అనంతరం పలు పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏపీసీ శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారులు డి.త్రినాధరావు, ఎల్.వెంకటరావు, ఐఈఆర్‌టీ కో ఆర్డినేటర్ గీత, సీఆర్‌పీ పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహనకు కళాజాత



చింతలలోవలో వీధినాటిక ప్రదర్శన

సింధియా, ఫిబ్రవరి 21: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతలలోవలో జీవీఎంసీ ఆధ్వర్యంలో డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా తదితర వ్యాధులపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై (కళాజాత) కళాబృందం ప్రజలకు వీధి నాటిక, జానపద గీతాలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, మలేరియా విభాగం సుపర్‌వైజర్లు, వైకె. రాజు కళాబృందం పాల్గొన్నారు.

చురుగ్గా నూకాలమ్మ ఆలయ నిర్మాణం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 21: జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సమీపంలోని వెదుళ్లనరవలో నూకాలమ్మతల్లి నూతన ఆలయ నిర్మాణం జోరుగా సాగుతోంది. బుధవారం ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించిన కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు మాట్లాడుతూ నూకాంబిక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉరుకూటి శ్రీనివాసరావు, ఎర్నిబాబు, ఒమ్మి రాము, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

స్టీల్‌ప్లాంట్ భూ సేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కోరిన నాయకులు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 21: విశాఖ ఉక్కు కర్మాగార నిర్వాసిత నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు స్టీల్‌ప్లాంట్ భూ సేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.సునీతను కోరారు. స్టీల్‌ప్లాంట్ భూ సేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆమెను బుధవారం సీపీఐ పెదగంట్యాడ మండల కార్యదర్శి యెల్లేటి శ్రీనివాసరావు, నిర్వాసిత సంఘం ప్రతినిధులు పి.దుర్గారావు, వై.దేముళ్లు, ఎన్.తాతారావు, తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు వేలాది మంది ఇంకా నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి స్టీల్‌ప్లాంట్‌లో శాశ్వత, కాంట్రాక్టు ప్రాతిపదికన ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిర్వాసిత నిరుద్యోగుల ఉపాధి సమస్యను ఉక్కు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని సునీత తమకు మాటిచ్చారని నాయకులు తెలిపారు.



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.సునీతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేఎస్‌ఎన్ రావు

యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలి

స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్‌ఎన్ రావు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 21: యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాల్సి అవసరం ఎంతైనా ఉందని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్‌ఎన్ రావు అన్నారు. మాఘ పౌర్ణమి ఉత్సవాలను పురస్కరించుకుని గంగవరం సీడబ్ల్యూసీలో బుధవారం నిర్వహించిన వివిధ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంగవరంలోని ఉక్కు సీడబ్ల్యూసీ ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు ఉక్కు గుర్తింపు యూనియన్‌గా తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. క్రికెట్, వాలీబాల్, వింద్‌బాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.మసేన్‌రావు, సీడబ్ల్యూసీ కార్యదర్శి పేర్ల సత్యారావు, కోశాధికారి కె.పోతన్న, చీకటి శ్రీనివాస్, పల్లేటి పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసిన టీఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్టీల్‌ప్లాంట్‌లోని తెలుగుతల్లి విగ్రహానికి టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి నేర్చుకునే భాషలో తొలుత ఉండేది మాతృభాషేనన్నారు. మాతృభాష కన్నతల్లి లాంటిదని, దీనిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారా మనం జీవ వైవిధ్యాన్ని కాపాడగలమని పేర్కొన్నారు. అనంతరం మాతృభాష పరిరక్షణకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు కామేశ్, అడుసుమల్లి దీప్తి, పి.శ్రీనివాసరావు, గుమ్మడి నరంద్ర, నమ్మి సింహాద్రి, మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'విజ్ఞాన్'లో మాతృభాషా దివాస్

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (ఎస్‌ఏసీ) ఆధ్వర్యంలో బుధవారం మాతృభాష దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాతృభాష గొప్పతనం గురించి వివరించారు. మాతృభాష తల్లిలాంటిదని, అందరూ మాతృభాష గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం. పోస్టర్ ప్రదర్శన, కవితల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ రవీంద్ర, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి బీఎంఎస్ నాలుగో రాష్ట్ర మహా సభలు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 21: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర నాలుగో మహా సభలు ఈ నెల 24 నుంచి షీలానగర్‌లోని బీవీకే స్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు బీఎంఎస్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి శరగడం రామచంద్రశేఖర్, అధ్యక్షుడు రొక్కం సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 20 ఏళ్ల తర్వాత విశాఖలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ మహా సభలకు బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు హిరణ్మయి పాండ్యా, దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి దొరై రాజు, జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎంపీఎస్ నాయుడు, ఆశ మోల్, తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మహా సభల్లో పలు తీర్మానాలు చేయనున్నట్టు పేర్కొన్నారు.

'టీడీపీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి'

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 21: శ్రమించే కార్యకర్తలను తెలుగుదేశం పార్టీ గుర్తిస్తుందని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు కోరారు. 88వ వార్డు పరిధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమ నిర్వహణలో, బూత్ ఏజెంట్లుగా ఉత్తమ పనితీరు కనబరిచిన ఒమ్మి రాము, ఉరుకూటి శ్రీనివాసరావు, ఎం.అప్పారావులను అభినందించారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుదామన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

ఆటోనగర్, ఫిబ్రవరి 21: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ఫీడర్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నెల 23వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ టీకే నాయుడు, ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా ఆటోనగర్ ఈ-బ్లాక్, అపెరెల్ పార్కు, వడ్లపూడి, తిరుమలనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ ఇండస్ట్రియల్ 11కేవీ ఫీడర్ పరిధిలో ఈ నెల 23న నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం రెండున్నర వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-2 ఈఈ టీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా అక్కిరెడ్డిపాలెం, వివేకానందకాలనీ, పంచవటి టౌన్‌షిప్, వికాస్ కళాశాల, ఏషియన్ పెయింట్స్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆత్మవిశ్వాసమే విజయానికి పునాది



ఫేర్‌వెల్ వేడుకలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

మల్కాపురం, ఫిబ్రవరి 21 : ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం తథ్యమని హెచ్‌పీసీఎల్ మేనేజర్ (హెచ్‌ఆర్) భారతి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ మహిళ కళాశాలలో బుధవారం సీనియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతరం కృషి ఉంటే విజయాలు తన సొంతమవుతాయని పేర్కొన్నారు. అన్ని రంగాలలో మహిళలు రాణించగలగితే దేశం అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ప్రతి మహిళ ఇంటి పనిని, ఉద్యోగాన్ని సమన్వయం చేసుకోవడం తెలుసుకొని క్రమబద్ధంగా జీవిస్తే సమాజం సుసంపన్నమవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి విద్యార్థులు తనదైన ముద్రను ప్రతిపనిలో చూపించాలని అన్నారు. సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జయశీల, ఇతర సిస్టర్స్, అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మిస్ సెయింట్ ఆన్స్ పోటీలను సీనియర్ విద్యార్థులకు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ విద్యార్థినుల నృత్యాలు , ఆలపించిన గీతాలు అలరించాయి.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

పెందుర్తి, ఫిబ్రవరి 21: స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సూర్యకళ ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మభాష ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు మాతృ భాషపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేలకు బహుమతులందజేశారు.

ముఖ్యమంత్రి సమక్షంలో వైసీపీలో చేరిక

గోపాలపట్నం, ఫిబ్రవరి 21: గ్రేటర్ 61వ వార్డుకు చెందిన జనసేన పార్టీ నేత ములంపాక అప్పారావు దంపతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో వీరు చినముషిడివాడ శారదా పీఠంకు వచ్చిన ముఖ్యమంత్రిని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా జగన్మోహనరెడ్డి పార్టీ కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

మేలో ప్రపంచ గవర మహాసభలు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 21: ఫిబ్రవరి చివరి వారంలో జరపాల్సిన ప్రపంచ గవర మహాసభలు వాయిదావేసి ఈ ఏడాది మేలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు గవర ప్రపంచ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సీఏ ఏవీ రమణ తెలిపారు.బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికలు నేపథ్యంలో మహాసభలకు అవకాశం తక్కువగా ఉన్నందున ఈమార్పు చేసినట్టు వివరించారు. గవర జాతీయులందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

దాత ఆర్థికసాయంతో గుడిలో టైల్స్ ఏర్పాటు


పోలమాంబ అమ్మవారి గుడిలో టైల్స్ నిర్మాణ పనులు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 21: గ్రేటర్ 30 వార్డు కుమ్మరవీధి పోలమాంబ ఆలయంలో టైల్స్ నిర్మాణ పనులకు మాజీ బ్రహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ ఆర్థిక సాయం చేశారు. ఇటీవల జరిగిన పరస మహోత్సవాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గర్భగుడికి టైల్స్ ఏర్పాటు ప్రతిపాదనలు సుధాకర్ ముందుంచారు. దీంతో స్పందించి ఆయన గర్భగుడిలో టైల్స్‌ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు డి. సత్యనారాయణ, వై.రాజు. నాని, సురేష్, కాళ్ల కిరణ్, శైలజా, డి.లక్ష్మీజ్యోతి, డి.పద్మజ సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హై కోర్టు స్టేపై హర్షం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 21: బీఈడీ అభ్యర్థులను ఎస్జీటీకి అనుమతించరాదని హైకోర్టు విధించిన స్టే పై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ స్టే ఇవ్వకుంటే లక్షలాది మంది డీఈడీ చేసిన అభ్యర్థులు నష్టపోతారన్నారు.

సాంకేతిక విద్యలో ప్రాంతీయ భాషల పాత్ర కీలకం

» ఎన్ఎస్‌టీఎల్ టెక్నికల్ డైరెక్టర్ చంద్రశేఖర్

» ఘనంగా మాతృభాషా దినోత్సవం

కంచరపాలెం, ఫిబ్రవరి 21 : సాంకేతిక విద్యలో ప్రాంతీయ భాష కీలకంగా మారుతోందని ఎన్ఎస్‌టీఎల్ టెక్నికల్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ అన్నారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ విశాఖ ఆధ్వర్యంలో బుధవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంతీయ భాషా ప్రచార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చంద్రశేఖర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఛైర్మన్ పీవీజీ గణేష్ కుమార్ మాట్లాడుతు ప్రాంతీయ భాషల్లో సాంకేతికతను అర్థం చేసుకుని ఆచరించడంతో ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. ప్రిన్సిపాల్ కె.నారాయణరావు, ఆర్.నాగేశ్వరరావు,అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్ఞానాపురం: స్థానిక సెయింట్‌జోసెఫ్ మహిళా కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సిస్టర్ డా.షైజీ ప్రారంభించగా, బుల్లయ్య కాలేజీ విశ్రాంత అధ్యాపకులు డా.ఎం సుబ్బారావు, ఆదిత్య కళాశాల ఆంగ్ల అధ్యాపకులు శ్రీ దివ్య అతిథులుగా హజరై మాతృభాష ప్రాశస్త్యం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు అంతర కళాశాలల మాతృభాషకు


సెయింట్ జోసెఫ్‌లో ప్రశంసా పత్రాలతో విద్యార్థులు


విద్యార్థులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

సంబంధించి వివిధ పోటీలు నిర్వహించారు. నగరంలోని 10కి పైగా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.విజేతలుగా నిలిచిన గాయత్రి, ప్రిజమ్, ఆదిత్య కళాశాలల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.కె. జయలక్ష్మి, సిస్టర్ షైన్, థామస్, డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్‌లో మాతృభాష దినోత్సవం

మురళీనగర్; అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని బుధవారం మురళీనగర్‌లో జరిపారు. శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమకారులు దత్తి.అప్పలనాయుడు అతిథిగా హాజరై తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. తెలుగు భాషలోని గొప్పదనం, తెలుగు, రచనలు తదితరాలపై మాట్లాడారు. బాలలు, విద్యార్థులకు విద్యా సామగ్రి అందించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి అధ్వర్యంలో నిర్వహించారు. క్లబ్ సభ్యులు, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు సంపద పలుకుబడులే..

సీతంపేట: తెలుగు భాషకు సామెతలు, జాతీయాలు గొప్ప సంపద అని సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు పేర్కొన్నారు. సీతంపేట రాంజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు పలుకుబడులు, వైచిత్రి అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూర్యారావు మాట్లాడుతూ తెలుగు జాతి సంస్కృతిని భాషతో ముడిపడి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.విజయకుమార్, సీహెచ్ చిన్న సూర్యానారాయణ, పరవస్తు ఫణిశయన సూరి, కొత్తూరు రమణ, కె.భీమస్త్రశ్వరరావు, రాంభట్ల నృసింహ శర్మ, మేడా మస్తాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాహితీవేత్త డాక్టర్ సూర్యారావు


మాధవధారలో బహుమతులిస్తున్న అతిథి

తెలుగుదేశం పాలనలోనే అభివృద్ధి

» టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 21: తెలుగుదేశం పార్టీ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి గండిబాబ్జీ అన్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులో శంఖారావం డోర్ టూ డోర్ సూపర్ 6 కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లలపాలెంలోని ప్రాంతంలోని పర్యటించి సూపర్ 6 పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రా ష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు మూలకు చేరాయన్నారు. వైసీపీ గత నాలుగున్నరేళ్ల పాలనలో రా ష్ట్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని విమర్శించారు.ప్రతిపక్షాలపై దాడులు, కక్ష సాధింపు చర్యలతో వైసీపీ పాలకులు ముందుకు సాగుతున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చం ద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు , క్లస్టర్ ఇన్‌చార్జిలు తదితరులున్నారు.


సూపర్ 6 పథకాల కరప త్రాలు అందిస్తున్న గండి బాబ్జీ

మీడియా గొంతు నొక్కాలని చూస్తున్నారు

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్


మాట్లాడుతున్న నజీర్

మహరాణిపేట, ఫిబ్రవరి 21:రాష్ట్రంలో పత్రికల గొంతు నొక్కాలని చూస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, ఈనాడు సంస్థలపై వైసీపీ నేతల దాడులను ఆయన ఖండించారు. ప్రపంచ చరిత్రలో నియంతలు గా పేరొందిన ముసోలిని, ఈడి అమీన్, హిట్లర్‌లకు ప్రతి రూపంగా ముఖ్యమంత్రి జగన్ ప్రవర్తిస్తున్నారని అన్నారు. అధికార గర్వంతో పత్రికలపై దాడులు చేయుస్తూ వికృతానందంపొందుతున్నారన్నారు.ప్రభుత్వ ఆరాచకాలను వెలుగులోకి తీసుకువస్తున్న పాత్రికేయులకు రాష్ట్రంలో రక్షణ కరువైందన్నారు. ప్రజాస్వామ్య వాదులంతా ఈ దాడులను ఖండించాలని కోరారు. రాష్ట్రంలో మీడియాపై జరుగుతున్న దాడులపై కేంద్ర ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పలు రైళ్లు రద్దు....రీ షెడ్యూల్

విశాఖపట్నం, ఫిబ్రవరి 21: వాల్తేరు డివిజన్ పరిధిలోని పార్వతీపురం, గుమ్డా స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్నందున ఈనెల 29 నుంచి పలు రైళ్లను రద్దుతోపాటు మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. అలాగే మరికొన్ని ఒరిజినేటింగ్ రైళ్లను రీ షెడ్యూల్ చేశామని పేర్కొన్నారు. ఈనెల 29 నుంచి మార్చి ఐదు వరకు విశాఖ-రాయపూర్ ప్రత్యేక పాసింజర్ (08528), రాయపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08527), విశాఖ-భవానిపట్న ప్రత్యేక పాసింజర్ (08504), విశాఖ-కోరాపుట్ ప్రత్యేక పాసింజర్ (08546), ఈనెల 29 నుంచి మార్చి ఆరు వరకు కోరాపుట్-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08545) రద్దు. మార్చి ఒకటి నుంచి ఆరు వరకు భవానీపట్న-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08503), మార్చి ఒకటి నుంచి నాలుగు వరకు విశాఖ-కోరాపుట్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18512), మార్చి రెండు నుంచి ఐదు వరకు కోరాపుట్-విశాఖ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18511) రద్దు చేశారు. పలు రైళ్లను ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేశారు. వాటిలో విశాఖ-లోకమాన్య తిలక్ టెర్మినస్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22847) మార్చి మూడో తేదీన ఐదన్నర గంటలు ఆలస్యంగా, నాందేడు-సంబల్‌పూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20810) మార్చి 4న నాలుగు గంటలు ఆలస్యంగా, ఇరోడ్-సంబల్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ మార్చి ఒకటన రెండు గంటలు ఆలస్యంగా, ఎర్నాకులం-టాటా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (08190) ఈనెల 29న రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరుతాయి.

దారి మళ్లింపు

విశాఖ-నిజాముద్దీన్ సమతా ఎక్స్‌ప్రెస్ (12807) ఈనెల 29, మార్చి 2, 3, 5న వయా దువ్వాడ, విజయవాడ, బల్లార్ష మీదుగా, నిజాముద్దీన్-విశాఖ సమతా ఎక్స్‌ప్రెస్ (12808) ఈనెల 29, మార్చి 1, 2, 4న వయా బల్లార్ష, విజయవాడ, దువ్వాడ మీదుగా నడుస్తాయి. టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) ఈనెల 29, మార్చి 3న టాటా, జరోలి, పలాస, విజయనగరం మీదుగా, ఎర్నాకులం-టాటా ఎక్స్‌ప్రెస్ (18190) ఈనెల 28, మార్చి 3న వయా విజయనగరం, పలాస, జరోలి మీదుగా నడుస్తాయి. వీటిలో పాటు పూరి-అహ్మదాబాద్-పూరి (12843/12844), పూరి-గాంధీధాం-పూరి (22974/22973), భువనేశ్వర్-జునాగర్ రోడ్డు-భువనేశ్వర్ (20837/20838) ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా కొన్ని తేదీల్లో మళ్లింపు మార్గం నడించనున్నారు.

పిచ్చోడి చేతిలో రాయిలా రాష్ట్రంలో పాలన

» జనసేన పార్టీ 'ఉత్తర' ఇన్‌చార్జి ఉషాకిరణ్


కస్తూరినగర్‌లో పర్యటిస్తున్న జనసేన పార్టీ నాయకులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ విమర్శించారు. గ్రేటర్ 46వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు గోరపల్లి శివ ఆధ్వర్యంలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని కస్తూరినగర్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆము హాజరై ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చరిత్రలో తుగ్లక్ కోసం చదువుకున్నామని, కానీ ప్రస్తుతం ప్రత్యక్షంగా చూస్తున్నామని జగన్ పాలననుద్దేశించి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 30వేల మంది మహిళలు మిస్సింగ్ అని తేలితే, దానిపై కనీసం సమీక్ష చేయకుండా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై క్రిమినల్ కేసు బనాయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరికిన సతీష్, శివారెడ్డి, రమణ, నూకరాజు, శ్రీధ ర్, భాస్కర్, మోసెస్, ఎల్లాజీ, కన్నా, టీడీపీ వార్డు అధ్యక్షుడు పుక్కళ్ల పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదులకు అధికారంతో విపరిణామాలు

» ప్రముఖ రచయిత్రి కేఎన్ మల్లీశ్వరి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత్రి మల్లీశ్వరి, తదితరులు

సీతంపేట, ఫిబ్రవరి 21: మతోన్మాద శక్తులు అధికారం చేపడితే ఎదురయ్యే ప్రమాదం గత పదేళ్లగా దేశంలో కనిపిస్తుందని ప్రము ఖ రచయిత్రి కేఎన్ మల్లీశ్వరి పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో రెడ్ బుక్ డేని పురస్కరించుకుని మార్క్సిస్టు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఫాసిజం మూలాలు అనే పుస్తకాన్ని మల్లీశ్వరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చరిత్రను వక్రీకరించి పాఠ్యాంశాలుగా ప్రవేశపెడుతున్నారన్నారు. మతోన్మాదాన్ని పెంచి హిందువులను ఓటు బ్యాంకుగా మలుచుకోవడంలో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్‌లు విజయవంత మయ్యాయని అన్నారు. పీపీఎస్‌పీసమన్వయకర్త పి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫాసిజాన్ని ఓడించడంలో కార్మిక వర్గం పాత్ర అనే అంశంపై ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, మతతత్వం, పర్యవసానాలు అన్న అంశంపై డాక్టర్ సీఎస్ క్షేత్రపాల్ రెడ్డి ప్రసంగించారు. అధ్యయన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా బోధన


చొరవ చూపాలని ఆర్‌ఐవో మురళీధర్

సీతంపేట, ఫిబ్రవరి 21: విద్యార్థులు ఒత్తిడి గురికాకుండా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఆర్‌ఐవో మురళీధర్ అన్నారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బోధన ఎలా చేయాలనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ లో పలు కళాశాలల జూనియర్ లెక్చరర్స్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో శ్రీ విశ్వ పాఠశాల్లో డైరెక్టర్లు కె.ధర్మరాజు, పి.సూర్యానారాయణ ఈ కార్య క్రమం నిర్వహించారు. ముఖ్యవక్తగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


సీతారాములు

సీతమ్మధార, ఫిబ్రవరి 21: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయి దేవస్థానంలో సీతారాముల కళ్యాణోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు రాజాస్వామి ఆధ్వర్యంలో ఈ వేడుక జరిపారు. భక్తులు ఆలయంలో శ్రీమద్రామాయణ పారాయణం చేశారు. మహిళలు కోలాటంతో అలరించారు.

పర్యావరణంపై అవగాహనకు దేశవ్యాప్త సైకిల్ యాత్ర

సీతమ్మధార, ఫిబ్రవరి 21: కాలుష్యంతో వాతావరణంలో చేకూరే నష్టాలపై అవగాహన కల్పిస్తూ సైకిల్ యాత్ర చేస్తున్నట్టు తమిళనాడుకి చెందిన శివసూర్యన్ సెంథిల్ రామన్ పేర్కొన్నారు. ఈ యాత్ర బుధవారం సీతమ్మధారకు చేరుకుంది. తమిళ కళాయ్‌మండపంలో శివసూర్యన్ సెంథిల్ రామన్ ఆయన మాట్లాడారు. కొవిడ్ సమయంలో తన ఆరోగ్యం కోసం ఇంటి నుంచి తన కార్యాలయానికి సైకిల్‌పై వెళ్లడం ప్రారంభించానన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని భావించి దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు విడతల వారీగా 30 వేల కిలోమీటర్ల ప్రయాణం సాగించానన్నారు. గుజరాత్ నుంచి కొయంబుతూర్, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 10 వేలకిలో మీటర్ల సైకిల్ యాత్రను ప్రస్తుతం కొనసాగిస్తున్నారన్నారు. జనవరి 15వ తే దీన కాశ్మీర్ శ్రీనగర్ నుంచి సైకిలింగ్ ప్రారంభించి సిక్కిం, గ్యాంగ్ టాక్, ఏపీలోని విశాఖపట్నం వచ్చానని తెలిపారు. కళాశాలల్లో విద్యార్థులకు వాతావరణం మార్పులు, కాలుష్యంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తాను 2017లో బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసినట్టు చెప్పారు.


సైకిల్ యాత్రలో శివసూర్యన్ సెంథిల్ రామన్

ముఖ్యమంత్రికి స్వాగతం


సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రులు బూడి, అమర్


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆహ్వానిస్తున్న అధికారులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 21: పెందుర్తి శారదాపీఠంలో జరిగిన రాజశ్యామల యాగంలో పాల్గొనడానికి నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం ఉదయం 11.50 గంటల గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న సీఎంకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బి.సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో చినముషిడివాడ వెళ్లారు. పర్యటన ముగించుకుని తిరిగి మధ్యాహ్నం 3.15కు విమానాశ్రయం చేరుకున్న సీఎంకు మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో 3.25 గంటలకు విజయవాడ వెళ్లారు.

రాష్ట్ర గవర్నర్‌కు....

మిలాన్-24లో పాల్గొనడానికి నగరానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం సాయంత్రం 5.29 గంటలకు ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరానికి వెళ్లారు.

అమ్మఒడి, ఆసరా డబ్బు తినడమే కాదు...

... 5వ పేజీ తరువాయి

దారిపొడవునా మహిళలను నిలబెట్టి ప్లకార్డులతో స్వాగతం పలకడం ద్వారా ఆయన మెప్పు పొందాలని భావించారు. దీనికోసం జీవీఎంసీ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను తరలించాలని యూసీడీ అధికారులను ఆదేశించారు. ఒక్కో ఆర్పీ తన పరిధిలోని గ్రూపుల నుంచి కనీసం వంద మందిని తీసుకురావాలని టార్గెట్ విధించారు. దీంతో ఆర్పీలంతా సీఎంకు స్వాగతం పలికేందుకు తప్పనిసరిగా రావాల్సిందేనని తమ పరిధిలోని మహిళా సంఘాల గ్రూపుల్లో వాయిస్ మెసేజ్‌లు పెట్టారు. దీంతో సభ్యులంతా తప్పదన్నట్టు ఉదయాన్నే ఎనిమిదిన్నరకు తమ ఇళ్ల వద్దకు వచ్చిన ఆటోలు ఎక్కి బయలుదేరారు.

షెడ్యూల్ ప్రకారం సీఎం జగన్ బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని రోడ్డు మార్గంలో శారదా పీఠానికి వెళ్లాలి. అందుకే ఉదయం తొమ్మిది గంటలకే మహిళలను సంబంధిత ఆర్పీలు, ఏపీడీలు తమకు కేటాయించిన ప్రాంతానికి తీసుకువెళ్లి రోడ్డుపక్కన నిలబెట్టారు. అయితే సీఎం ఎయిర్‌పోర్టులో దిగిన తర్వాత గంట ఆలస్యంగా అక్కడ నుంచి బయలుదేరారు. అప్పటికే గంటల తరబడి ఎండలో నిలబడిన మహిళలు ఎండ తీవ్రతకు ఇబ్బందిపడ్డారు. తమ చేతిలో ఉన్న ప్లకార్డులను అడ్డంపెట్టుకుని ఫుట్‌పాత్‌లపైనే కూర్చుండిపోయారు. మరికొందరు సమీపంలోని దుకాణాల వద్దకు వెళ్లి ఎండ నుంచి సేదతీరారు. యూసీడీ సిబ్బంది మహిళా సంఘాల సభ్యుల వివరాలతో కూడిన జాబితాను చేతిలో పట్టుకుని మరీ వచ్చినవారి హాజరు తీసుకోవడం కనిపించింది. గ్రూపుల వారీగా ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించారు. మహిళలను సమీకరించడంతోపాటు వచ్చినవారు తిరిగి వెనక్కి వెళ్లిపోకుండా ఆపేందుకు వీలుగా ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో ఏపీడీ, పీడీతోపాటు జోనల్ కమిషనర్లుకి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఇదిలావుంటే సీఎంకు స్వాగతం పలికేందుకు వచ్చిన మహిళలు మండుటెండలో గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో అధికారుల తీరును తూర్పారబట్టారు. సీఎం వస్తే పార్టీ కార్యకర్తలను తీసుకువెళ్లాలిగానీ, ప్రతిసారీ తమనే రావాలని ఆదేశించడం ఎంతవరకు సమంజసమని గోపాలపట్నం జంక్షన్‌లో నిలబడిన ఒక మహిళ నిలదీశారు. మహిళలకు సంబంధించిన కార్యక్రమాలకు తమను పిలిస్తే ఇబ్బందిలేదు గానీ, ఆటల పోటీల ముగింపునకు, ఇతరత్రా కార్యక్రమాలకు సీఎం వస్తున్నారని ప్రతిసారీ తమనే తరలించడం వల్ల కుటుంబపరంగా ఇబ్బందులు పడుతున్నామని బాజీ జంక్షన్‌లో నిలబడిన మహిళలు కొందరు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాకపోతే పథకాలు ఆపేస్తామని బెదిరిస్తున్నారని, వస్తే ఇంట్లో పనులు ఆగిపోతున్నాయని మరికొందరు మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు.

అధికారుల ఓవరాక్షన్

... 5వ పేజీ తరువాయి

చెప్పి, ఆ మేరకు కూలీలను మాట్లాడుకున్నారు. ఈలోగానే మంగళవారం అర్ధరాత్రి తరువాత ఎయిర్‌పోర్టు నుంచి చినముషిడివాడ వరకూ గల టీడీపీ హోర్డింగ్‌లను తొలగించారు. ఫ్లెక్సీలు పనికిరాకుండా చించివేశారు. వాటి స్థానంలో కొన్నిచోట్ల 'సిద్ధం' ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతించారు. కాగా యాడ్ ఏజెన్సీలు, ప్రైవేటు భవనాల యజమానులు బుధవారం ఉదయం ఈ విషయం గుర్తించారు. జీవీఎంసీ అధికారుల అత్యుత్సాహం వల్ల టీడీపీ నేత శ్రీభరత్‌కు సుమారు ఐదారు లక్షల రూపాయల మేర నష్టం జరిగింది. జీవీఎంసీకి అద్దె చెల్లించి చట్టబద్ధంగా హోర్డింగ్‌లు ఏర్పాటుచేస్తే దౌర్జన్యంగా తొలగించడమేమిటని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ సీఎం పర్యటనలో ఫ్లెక్సీలు తొలగించి జీవీఎంసీ అధికారులు తమ స్వామి భక్తిని చాటుకున్నారని ఆరోపించారు. అద్దెకు తీసుకున్న హోర్డింగ్‌లపై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు తొలగించడం అన్యాయమన్నారు. రాజకీయ పార్టీల నాయకులకు అధికారులు తాబేదార్లుగా వ్యవహరించకుండా నిబద్ధతతో పనిచేయాలన్నారు.

అంతా అండర్ స్టాండింగేనా??

... 5వ పేజీ తరువాయి

పరిపాలనా ఆమోదం తెలిపింది. వాస్తవానికి పనులకు పరిపాలనా ఆమోదం లభించిన తరువాతే అధికారులు టెండరు ప్రక్రియ ప్రారంభించాలి. టెండర్లలో ఎవరు తక్కువకు కోట్ చేస్తే వారికి పనులను అప్పగించి, నిబంధనల ప్రకారం పూర్తయ్యేలా చూడాలి. కానీ జీవీఎంసీ అధికారులు మాత్రం ఆయా పనులను టెండర్ వరకూ వెళ్లకుండా కేవలం నామినేషన్ పద్ధతిపై తమ అస్మదీయులకు అప్పగించేందుకు వీలుగా ఒక్కో పనిని ముక్కలుగా చేసి రూ.5 లక్షలలోపు ఉండేలా ప్రతిపాదనలు తయారుచేశారు. ఇప్పటికే నామినేషన్ పేరుతో పనులు పూర్తిచేసి...ఇప్పుడు పరిపాలనాఆమోదం కోరడాన్ని ఏవిధంగా చూడాలో జీవీఎంసీ పాలకవర్గం పెద్దలు, జీవీఎంసీ ఉన్నతాధికారులు చెప్పాలని విపక్ష కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఇదిలావుంటే వెంకోజీపాలెం జంక్షన్ నుంచి హనుమంతవాక జంక్షన్ వరకూ జాతీయ రహదారిపై రెండువైపులా కొత్తగా హాట్ మిక్స్ తారురోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. ఒకపక్కన పని పూర్తిచేసేసి...ఇప్పుడు పరిపాలనా ఆమోదం ఇస్తే రూ.99.5 లక్షలు అంచనా వ్యయంతో టెండర్లు పిలిచి, పనులు పూర్తిచేస్తామంటూ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి స్టాండింగ్ కమిటీ ముందు పెట్టారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించినా సభ్యులు కనీసం అభ్యంతరం చెప్పకుండానే ఆమోదించేస్తున్నట్టు ప్రకటించేయడం విశేషం. అసలు కొత్తగా రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించిన జాతీయ రహదారి జీవీఎంసీకి చెందినది కానప్పటికీ ఎలా నిధులు ఖర్చు చేస్తారు?, టెండర్ పిలవకుండా ఇప్పటికే పూర్తిచేసిన పనికి ఇప్పుడు పరిపాలనా ఆమోదం కోరడంలో ఆంతర్యమేమిటని అధికారులను నిలదీయకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా పెదగదిలిలో ఇప్పటికే వంతెన నిర్మాణం పనులు ప్రారంభించేయగా, ఆ పనికి కూడా ఇప్పుడు పరిపాలనా ఆమోదం తెలపాలని కోరారు. వీటికితోడు జోన్-3 పరిధి టౌన్‌కొత్తరోడ్డులోని ఎంఎస్ఎఫ్‌లో పోగైన చెత్తను అక్కడే ఏర్పాటుచేసిన క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్(సీసీఎస్)లో వాహనాలతో వేసేందుకు ఏకంగా రూ.55 లక్షలు ఖర్చవుతుందని పేర్కొంటూ ప్రతిపాదనలు తయారుచేయగా, కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించేయడం ఆశ్చర్యానికి గురిచేసింది. సీసీఎస్ నుంచి చెత్తను కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించడానికే ఏడాదికి రూ.1.5 కోట్లు ఖర్చవుతుంటే, పది అడుగుల దూరంలో ఉన్న చెత్తను కాంపాక్టర్లలో వేసేందుకు ఏకంగా రూ.55 లక్షలు ఎందుకు ఖర్చవుతుందని సభ్యులు ప్రశ్నించకపోవడం విస్మయపరుస్తోంది. ఇలాంటి నిర్ణయాలు చాలా ఉన్నాయని అధికారులు చెబుతుండడం స్టాండింగ్ కమిటీ పనితీరుకు అద్దంపడుతోంది.

'నాయీ బ్రహ్మణులకు మొండిచేయి'


మాట్లాడుతున్న జనసేన నేత సాధిక్

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 21: వైసీపీ పాలనలో నాయీ బ్రహ్మణుల ఉనికికే తీ వ్ర నష్టం జరిగిందని జనసేన ఉత్తరాంధ్ర కన్వీనర్, 39 వ వార్డు కార్పొరేటర్ సాధిక్ విమర్శించారు. బుధవారం లక్ష్మీ టాకీస్ వద్ద పార్టీ కార్యాలయంలో నాయీ బ్రహ్మణులతో జరిగిన ఆత్మీయసమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు ఉచితంగా వృత్తి పనిముట్లు, సబ్సిడీ రుణాలు అందించి ప్రోత్సహించిందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన అన్నిరకాలు సబ్సిడీ రుణాలు నిలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయీ బ్రహ్మణుల కమిటీ సభ్యులు జగన్నాధరావు, ఎ.తిరుపతి, రాంబాబు, సురేష్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 21 : జీవీఎంసీ 9వ వార్డు కైలాసగిరి తెలుగు మ్యూజియం ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జోడుగుళ్లపాలెం, దయాల్‌నగర్, కో-ఆపరేటివ్ లేఅవుట్, ఎస్సీ, ఎస్టీ కాలనీ, పోలీసు పెట్రోల్ బంక్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు.


ఆరిలోవలో...

ఆరిలోవ : విమ్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ పనులు, హనుమంతువాక రోడ్డు నుంచి కైలాసగిరికి వెళ్లే మార్గంలో జీవీఎంసీకి సంబంధించి స్తంభాల మా ర్పిడి దృష్ట్యా గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాస్ తెలిపారు. బీఎస్ఆర్ నగర్, తోటగరువు, హనుమంతువాక కొండ, విజయదుర్గా కాలనీ, విశాలాక్షినగర్ రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

తగరపువలస, ఫిబ్రవరి 21 : తగరపువలసలోని ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు దత్తి ఈశ్వరరావు, రేఖ అప్పారావు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అంబేడ్కర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో తరగతులు జరుగుతాయని, ఆసక్తి గల వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. అలాగే టెట్‌కు సంబంధించి శిక్షణ కూడా అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 99491 49541 నంబరును సంప్రతించాలన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం



సింహాచలం, ఫిబ్రవరి 21 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం వైభ వంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతాది ప్రభాతారాధనలు పూర్తి చేసి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనమలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

గీతంలో భట్నాగర్ జయంతి

సాగర్‌నగర్, ఫిబ్రవరి 21 : సమాజ హితానికి విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు ఎంతో అవసరమని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కేఎస్ కృష్ణ అన్నారు. సర్.శాంతి స్వరూప్ భట్నాగర్ 130వ జయంతి సందర్భంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లోని భట్నాగర్ ప్రయోగశాల వద్ద బుధవారం పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ వేదవతి, సైన్స్ విభాగాధిపతులు, అధ్యాపకులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా కాలనీలో 'ఆరోగ్య సురక్ష'

భీమునిపట్నం, ఫిబ్రవరి 21 : పట్టణంలోని కృష్ణా కాలనీ వార్డు సచివాలయంలో బుధవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ వైద్యులు 452 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కనకమహాలక్ష్మి, జోనల్ కార్యాలయం అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రాల సంరక్షణ పట్ల అప్రమత్తం

ఆరిలోవ, ఫిబ్రవరి 21 : విద్యార్థులు కళ్ల సంరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యురాలు డాక్టర్ హిమబిందు సూచించారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు డిజిటల్ ఉపరణ వినియోగాన్ని తగ్గించాలని చెప్పారు.

సినిమా గైడ్

- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, రమాదేవి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** లీలామహల్, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23,టమాటా 20, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 48, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 48, బీరకాయలు 55, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 20, క్యారేట్ 20, దొండకాయలు 38, బంగాళా దుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 110, బరబటి 30, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 215, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 34 , కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



రోజు వారీ మార్కెట్‌లో దుకాణాలు



మార్కెట్‌లో శిథిలావస్థలో ఉన్న ఓ దుకాణం

మధురవాడవాసులకు డైలీ కష్టాలు

- 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రోజు వారీ మార్కెట్
- ఎన్నికల హామీగా మిగిలిన దుకాణాల సముదాయం నిర్మాణం
- 20 నివాస ప్రాంతీయులకు నిత్యం అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మధురవాడ, ఫిబ్రవరి 21 : ఏళ్లు గడుస్తున్నా.. మధురవాడ రోజువారీ మార్కెట్ దుస్థితి మారలేదు. 30 ఏళ్లుగా ఇక్కడ అభివృద్ధి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. సుమారు 25 కుటుంబాలు ఈ మార్కెట్‌లో నిత్యం వివిధ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఐదేళ్లకు ఒకసారి పాలకులు మారుతున్నా.. మార్కెట్‌కు పక్కా దుకాణాలు మాత్రం సమకూరడం లేదు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామన్న పాలకులు హామీ ఇస్తున్నారు తప్ప నెరవేర్చడం లేదు. జాతీయ రహదారికి అభిముఖంగా సుమారు అర ఎకరా విస్తీర్ణంలో రెండు వరుసల్లో 25 దుకాణాలు ఉన్నాయి. ప్రస్తుతం తాత్కాలిక షెడ్లలో వ్యాపారులు కొనసాగుతున్నారు. ఇక్కడ కోడి మాంసం, వేట మాంసం, చేపలు దుకాణాలతో పాటు కూరగాయలు, పండ్లు కూడా విక్రయిస్తారు. ఆదివారం వస్తే మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంది. వ్యాపారులు జీవీఎంసీకి ప్రతి నెలా ఆశీలు కడుతున్నారు. ఈ మార్కెట్‌కు కొమ్మాది, మధురవాడ, బొట్టవానిపాలెం, మల్లయ్యపాలెం, స్వతంత్రనగర్‌కాలనీ, పీఎం పాలెం, వుడాకాలనీ, వాంబే కాలనీ తదితర 20 ఆవాస ప్రాంతీయులు వచ్చి సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. అయితే మార్కెట్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులతో పాటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షం పడితే మార్కెట్ మొత్తం బురదమయం అవుతుంది.

పదేళ్ల కిందట ప్రస్తుతం ఉన్న దుకాణాలు తొలగించి జీవీఎంసీ ఆధ్వర్యంలో రెండు అంతస్తుల భవన సముదాయం నిర్మించడానికి ప్రతిపాదించారు. నూతన దుకాణాలను ప్రస్తుతం ఉన్న వ్యాపారులకు ఇవ్వడానికి జీవీఎంసీకి, వ్యాపారులకు మధ్య పరస్పర అంగీకారం కుదిరింది.. కాలక్రమంలో ఆ ప్రతిపాదన గాల్లో కలిసిపోయింది. అప్పటి నుంచి వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కోట్లాది రూపాయల విలువ చేసే మార్కెట్ స్థలంలో పక్కా భవనాలు నిర్మించాలని వ్యాపారులు, స్థానికులు కోరుతున్నారు.

వ్యాపారాలు కోల్పోయాం



మార్కెట్‌లో 30 ఏళ్లుగా చికెన్ దుకాణం నిర్వహిస్తున్నాను. కనీస వసతులు లేకపోవడంతో కొనుగోలుదారులు రావడం లేదు. దీంతో వ్యాపారం సరిగ్గా జరగడం లేదు. ప్రస్తుతం ఉన్న దుకాణాలు తొలగించి వాటి స్థానంలో పక్కా దుకాణాలు నిర్మిస్తామన్నారు. కానీ ఆ ప్రతిపాదన అమలు కాలేదు.

- గొర్లె ముత్యాలరావు, చికెన్ షాపు వ్యాపారి

రోజూ కూరగాయలు సర్దుకోవడమే..



రోజూ ఉదయం కూరగాయలు సర్దుకోవడం, మళ్లీ రాత్రి వాటిని జాగ్రత్త చేసుకోడానికి సగం సమయం గడచిపోతుంది. కొన్నిసార్లు దాచుకున్న కూరగాయలు పశువులు తినడంతో నష్టపోతున్నాం. పక్కా దుకాణాలు ఉంటే షట్టర్ వేసుకుంటాం.

- పాలవలస ఆదిలక్ష్మి, కూరగాయల వ్యాపారి

రామయ్య సన్నిధిలో పునర్వసు నక్షత్ర హవనం

సింహాచలం, ఫిబ్రవరి 21 : సింహగిరిపై ఈశాన్య దిక్కులో ఉన్న సీతారామస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్ర హవనాన్ని బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రభాత సేవల తరువాత ఉత్సవమూర్తి చక్రపెరుమాళ్‌ను ప్రత్యేక వేదికపై ఉంచి మండపారాధన, కలశారాధన, బింబారాధన జరిపారు. అనంతరం ముందుగా సిద్ధం చేసిన హోమకుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేశారు. పంచసూక్తాలు, రామషడక్షరీ మంత్రంలో రుత్వికులు సంక్షిప్త రామయణాన్ని పఠిస్తుండగా హవనాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

135 మంది మహిళలకు కేన్సర్ పరీక్షలు



మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆరిలోవ, ఫిబ్రవరి 21 : రవీంద్రనగర్ జంక్షన్‌లోని సేవా స్ఫూర్తి భవన్‌లో థాన్ ఫౌండేషన్, మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో కేన్సర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 135 మంది మహిళలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి వైద్యులు సుభద్ర, భవానీ, థాన్ ఫౌండేషన్ హెల్త్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, మార్కెటింగ్ మేనేజర్ దినేష్, సేవా స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు, అచ్యుతరావు, నాయుడు, కేత సత్యనారాయణ, నానాజీ, శెట్టి లక్ష్మణరావు పాల్గొన్నారు.

పిఠాపురం కాలనీలో సంత కొనసాగించాలి

మద్దిలపాలెం, ఫిబ్రవరి 21 : జీవీఎంసీ 22 వార్డు పిఠాపురం కాలనీ కళాభారతి రోడ్డు మార్గంలో ప్రతి సోమవారం జరుగుతున్న సంతను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వి. కృష్ణారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పిఠాపురం కాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 16 ఏళ్లుగా ఉన్న సంతను వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అక్రమంగా తొలగించడం సరైందని కాదన్నారు. వ్యాపారులతో కనీసం మాట్లాడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా అర్ధాంతరంగా నిలిపివేయడం అన్యాయమన్నారు. దీనిపై 23న కళాభారతి జంక్షన్‌లో నిరసన చేపడతామని చెప్పారు. ఆయనతో పాటు నాయకులు కె.కుమారి, అనపర్తి అప్పారావు, బుజంగరావు ఉన్నారు.

'వైసీపీ పాలనలో పత్రికా స్వేచ్ఛ లేదు'

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 21 : వైసీపీ పాలనలో పత్రికా స్వేచ్ఛ లేదని టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కరిమిన లీలావతి అన్నారు. బుధవారం ఆమె ఇక్కడి విలేకరులతో మాట్లాడారు.అనంతపురం జిల్లా రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై రాళ్లు వేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వం చేసే తప్పులను ఎత్తి చూపితే దాడులతో భయపెట్టాలనుకోవడం అవివేకమన్నారు.

అనంతవరంలో క్రీడాకారుడికి సత్కారం



క్రీడాకారుడు రాంబాబును సత్కరిస్తున్న గ్రామస్తులు

పద్మనాభం, ఫిబ్రవరి 21 : జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పలు పతకాలు సాధించిన ఆర్టీసీ కండక్టరు, క్రీడాకారుడు రాంబాబును అనంతవరం గ్రామస్తులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భీమిలి మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు జీవీవై నాయుడు క్రీడాకారుడికి రూ. 10 వేలు అందజేశారు. అలాగే ఆడుదాం ఆంధ్రాలో రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లిన చందక సాయికుమారికి రూ. 2 వేలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణకుమార్, మాజీ ఉపసర్పంచ్ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

మధురవాడ వంతెన కింద ట్రాఫిక్ జామ్

మధురవాడ, ఫిబ్రవరి 21 ; మధురవాడ ఎత్తు వంతెన కింద బుధవారం రాత్రి భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పదుల సంఖ్యలో వాహనాలు ఇటు సర్వీసు రోడ్డుతో పాటు అటు వంతెన కింద బారులు తీరాయి. వంతెన ఇరుగ్గా ఉండడంతో పాటు ఒక వైపు భారీ మార్ట్ ఉండడంతో వాహనదారులకు నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు పది ఆవాస ప్రాంతాల ప్రజల రాకపోకలకు ఇదొక్కటే మార్గం. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు.వంతెన కింద నుంచి నాలుగు చక్రాల వాహనాలు వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకున్నప్పటికీ సమస్య మాత్రం అలాగే ఉంది.వంతెన కింద నుంచి వెళ్లే వాహనాల క్రమబద్ధీకరణకు ఉదయం, సాయంత్రం వేళల్లో పోలీసులు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తే కొంతవరకు ఇబ్బందులు ఉండవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అందరి సహకారంతో నూకాలమ్మ ఉత్సవం

భీమునిపట్నం, ఫిబ్రవరి 21 : భీమిలి గ్రామ దేవత నూకాలమ్మ ఉత్సవాల నిర్వహణకు అందరూ సహకరించాలని కమిటీ అధ్యక్షుడు గిడుతూరి శ్రీనివాసరావు కోరారు.బుధవారం బీచ్ రోడ్డులో వున్న శ్రీసరస్వతి సమాజంలో అమ్మవారి ఉత్సవ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవానికి భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివస్తారని, నిర్వహణకు ఆర్థికంగా సహకరించే దాతలకు, భక్తులకు సదుపాయాల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నామన్నారు. ఏప్రిల్ 7 నుంచి 10 వరకూ ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి పీరుపిల్లి రాజు, కోశాధికారి రాకోతు నర్సింగరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగిరెడ్డి వెంకటస్వామి, కోఆర్డినేటర్ అప్పికొండ బాలకృష్ణ, ప్రముఖులు గంటా నూకరాజు, అల్లిపిల్లి నర్సింగరావు, వాసుపల్లి కొండబాబు, కంటుభుక్త ముత్యాలరావు, పెంటపల్లి యోగేశ్వరరావు, నమ్మిశేషాద్రి, ఎచ్చర్ల హరి పాల్గొన్నారు.

'విద్యా వ్యవస్థకు వైసీపీ ప్రభుత్వం తూట్లు'

భీమునిపట్నం, ఫిబ్రవరి 21 : రాష్ట్ర ప్రభుత్వ విధానాలు విద్యా వ్యవస్థకు తూట్లు పొడిచేలా వున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విమర్శించారు. బుధవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో 80 ఏళ్లుగా విద్యా రంగానికి ఎంతో సేవ చేస్తున్న సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ స్కూల్, బాలికల ఉన్నత పాఠశాలలు మూసివేసే స్థితికి రావడం బాధాకరమన్నారు. అతి తక్కువ ఫీజులతో పిల్లలు చదువుకోవడానికి సెయింట్ ఆన్స్ హైస్కూల్ ఎంతో దోహదపడిందని, అక్కడ చదివిన ఎందరో బాలికలు నేడు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. అటువంటి పాఠశాలకు మూసివేసే పరిస్థితులు కల్పించడం వైసీపీ అసమర్థ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.

'పద్మనాభం అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి'

పద్మనాభం, ఫిబ్రవరి 21 : పద్మనాభం మండలాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని వైసీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, ఎంపీపీ రాంబాబు తెలిపారు. బుధవారం వారు పద్మనాభంలో విలేకరులతో మాట్లాడారు. కోట్లాది రూపాయల నిధులతో ఎమ్మెల్యే మండలాన్ని అభివృద్ధి చేసినా ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేయడం తగదన్నారు. పాండ్రంగిలో గోస్తనీ నదిపై వంతెన నిర్మాణానికి రూ. 16 కోట్లు విడుదల చేశారని, అనంతుని ఘాట్‌రోడ్డుతో పాటు అనంతుని ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని చెప్పారు. జలజీవన్ మిషన్ నిధులతో ప్రతి ఇంటికి తాగునీరు అందించే పనులు పూర్తయ్యాయన్నారు. ఇనాం భూముల రైతులకు రైతు భరోసాతో పాటు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పారావు ఆదిబాబు, బంగారప్పడు, అప్పారావు, పద్దు, సన్యాసినాయుడు,నారాయణరావు భాస్కరరావు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన

భీమునిపట్నం, ఫిబ్రవరి 21 : పట్టణంలోని 4వ వార్డు చినఉప్పాడలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ. 22 లక్షల జీవీఎంసీ నిధులతో రోడ్లు, కాలువలు నిర్మించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నూకరాజు, రాములప్పడు, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 21 : మాతృ భాష అమ్మ వంటిదని, మన భాషను నిర్లక్ష్యం చేస్తే అమ్మను నిర్లక్ష్యం చేసినట్లేనని వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఎంవీపీ కాలనీలోని శాఖా గ్రంథాలయంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జేకే ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కె. లక్ష్మణ్, సచివాలయం పంచాయతీ కార్యదర్శి వై. రమ విద్యార్థులకు తెలుగు భాష గొప్పదనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కేవీఏ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో...

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు ఆదర్శనగర్‌లో ఉన్న శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్లోనూ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు రవీంద్రబాబు, అనూరాధ, అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషతో పాటు ఇతర భాషల్లోనూ ప్రావీణ్యం సంపాదించాలన్నారు. అనంతరం విద్యార్థులకు భగద్గీత శ్లోకాల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మోహన్ కృష్ణ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జరజాపు రంగరావు, స్కూల్ డైరెక్టర్లు విజయభాస్కర్, చంద్ర పాల్గొన్నారు.



ఎంవీపీలోని శాఖా గ్రంథాలయంలో వేడుకలు



భీమిలిలో మాట్లాడుతున్న గంటా నూకరాజు

భీమిలిలో..

భీమునిపట్నం : మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత అని ఆదర్శ హిందీ ప్రేమి మండలి గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు అన్నారు. బుధవారం జీఎస్ఆర్ భవన్‌లో ఆ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. దేశంలో 1,652 భాషలుండగా, జాతీయ భాష హిందీ తర్వాత ఎక్కువగా మాట్లాడేది తెలుగేనని చెప్పారు.



ఆలయంలో ప్రతిష్ఠించిన సీతారామ లక్ష్మణ విగ్రహాలు

వైభవంగా సీతారామ లక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠ



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

మధురవాడ, ఫిబ్రవరి 21 : జీవీఎంసీ ఏడో వార్డు పిలకవానిపాలెం, పాతపీఎంపాలెంలో సీతారామ లక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఈ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ముందుగా గణపతి పూజ, గోపాద పూజ, అష్టబలి ప్రధానం, ఆలయ ప్రవేశం, యంత్ర ప్రతిష్ఠ, భూశుద్ధి, తదితర పూజలు చేశారు. అనంతరం ఉదయం 10.26 గంటలకు పండితుల వేదాశీర్వచనాల మధ్య సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలకు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ దంపతులు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. రాళ్లపల్లి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన, సాయంత్రం 4 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఉత్తర ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు పల్లా శ్రీనివాసరావు, భీమిలి నియోజకవర్గం టీడీపీ,జనసేన ఇన్‌చార్జిలు కోరాడ రాజబాబు, పంచకర్ల సందీప్ నాయకులు పోతిన బాలాజీ, పోతిన ప్రసాద్, 7వ వార్డు జనసేన అధ్యక్షుడు నాగోతి నరసింహనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 21 : విద్యార్థి దశలో చట్టాలపై అవగాహనపెంచుకోవడం వల్ల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చని ద్వారకా పీఎస్ నేర విభాగం సీఐ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎంవీపీకాలనీలోని అక్వార్‌దాస్ డిగ్రీ కళశాలలో విద్యార్థులకు నేరాలు, శిక్షలు అన్న అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొలుసు దొంగతనాలు, బైక్ చోరీలు, పోస్కో చట్టం, గంజాయి తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేరాలు చేసి భవిష్యత్తును పాడుచేసుకోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాందాసు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లెబన్స్ హిల్ఫే సంస్థ సేవలు నిరుపమానం



కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ క్లబ్ సభ్యులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 21 : మానసిక వికలాంగులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్న లెబన్స్ హిల్ఫే ఇండియా సంస్థ సేవలు నిరుపమానమని రోటరీ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్ కిషోర్ కుమార్ అన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు తల్లాప్రగడ సరస్వతీదేవి 81వ జయంతి సందర్భంగా విద్యార్థులకు బుధవారం డ్రాయింగ్, వృత్తి నైపుణ్యాలు, ఆటలు, పాటలు, సంగీతం, నృత్యం పోటీలు ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ లక్ష్మీ సూర్యశ్రీ, రొటేరియన్లు నాగరాజు, బ్రహ్మానందం, వెంకటరావు, శంకరరావు, జోస్, మూర్తి పాల్గొన్నారు.

బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రామ్‌కుమార్



పార్టీ నాయకులతో రామ్ కుమార్

పెదవాల్తేరు, ఫిబ్రవరి 21 : బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొప్పల రామ్‌కుమార్ నియామితులయ్యారు. ఈమేరకు బుధవారం ఆయనకు నగరంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ్‌రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర కార్యదిర్శ కేతినేని సురేంద్ర మోహన్ నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్‌రెడ్డి, జిల్లా సంయోజక్ శ్రీరామ్ మోహన్, ప్రధాన కార్యదర్శులు దిలీప్ వర్మ, శ్రీనివాస్, శ్రీరంగం దానేశ్వరరావు, దక్షిణ కన్వీనర్ అత్తిలి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్రిపురాంతకుని వార్షిక కల్యాణం



స్వామివారికి కల్యాణం చేస్తున్న పండితులు

సింహాచలం, ఫిబ్రవరి 21 : సింహగిరి క్షేత్రపాలకుడు బాలత్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామి వార్షిక తిరు కల్యాణం బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఏటా మాఘమాస శుక్ల పక్ష ఏకాదశి నాడు త్రిపురాంతకస్వామి వార్షిక కల్యాణం చేయడం పరిపాటి. అలాగే ఏకాదశి పురస్కరించుకుని ఈనెల 20న రాత్రి శైవాగమశాస్త్ర విధానంలో గణపూజ, కంకణ ధారణ, పుణ్యాహవచనములుతో శ్రీకారం చుట్టి షోడశోపచారాలు సమర్పించారు. కన్యావరుణం, మధుపర్కప్రాశనము, పాదప్రక్షాళనములు చేశారు. శుభ ముహూర్తానికి ఆలయ అర్చకులు మంగళ్యధారణలు జరిపించారు. అక్షితారోపణ తరువాత మంగళనీరాజనాలిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కళాశాలలకు సిమెంట్ బెంచీలు వితరణ



బెంచీలు అందజేసిన దాతలతో కళాశాలల అధ్యాపకులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 21 : పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలు, పలు ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వీటిని ప్రభుత్వ జూనియరు కళాశాలలో చదువుకుని ప్రస్తుతం ఐపీఎస్‌గా పనిచేస్తున్న క్రాంతికుమార్ తన తండ్రి జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు.అలాగే అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన స్వర్గీయ నరసింహప్పడు పేరుతోనూ, స్వర్గీయ బెవర అప్పలనాయుడు,కాళ్ల నారాయణరావు జ్ఞాపకార్థం వారి కుటుంబికులు కాంక్రీట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వీటిని కళాశాల ప్రిన్సిపాల్ మంజుల ప్రారంభించారు. కార్యక్రమంలో బీఎన్‌డబ్ల్యూ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు, జి. వెంకటరత్నం, మూర్తి, ముసునూరి శ్రీనివాసరావు, పెంటపల్లి దేవానంద్, గుగ్గిళ్ల పార్వతీశం, సన్నీ కాళ్ల, డాక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.